

జన రాజకీయం కోసం...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9 పక్షపత్రిక సంచిక - 17

సెప్టెంబర్ 1-15, 2018

## పంచాయతీ ఎన్నికలు తక్షణమే జరిపించాలి




## నిరుద్యోగ భృతి వర్సెస్ జైలు సౌకర్యాలు

ఎన్నికల నేపథ్యంలో లోక్‌సత్తా పార్టీ బలోపేతానికి ఏపీ, తెలంగాణల్లో కమిటీల్ని ప్రకటించిన జేపీ





# విద్యార్థులను గ్లోబల్ సిటిజన్స్‌గా తయారుచేయాలి

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవటంతోపాటు చర్చా వేదికల్లో పాల్గొంటూ నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కోరారు.

హైదరాబాద్ ఓల్డ్ సఫీల్‌గూడలోని డీఏవీ పాఠశాలలో మూడు రోజులపాటు జరిగే మోడల్ ఐక్యరాజ్యసమితి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ప్రపంచంలోని పలు దేశాల స్థితిగతులపై విద్యార్థులకు అవగాహన ఉండాలని జేపీ అన్నారు. మనదేశంలోని విద్య, వైద్యం, ఇతర మౌలిక రంగాలను ఇతర దేశాలతో పోల్చి చూసుకుంటే... మన లోపాల్ని దిద్దుకోవటానికి కావలసిన అవగాహన, విశాల దృక్పథం పెరుగుతాయన్నారు. టెర్రరిజం, కాలుష్యం, ఆకలి, దేశాల మధ్య యుద్ధాలు వంటి సమస్యలపై కూడా విద్యార్థులకు స్పష్టత ఉండాలన్నారు. సరైన బహిరంగ చర్చాప్రమాణాలతో ఈ సమస్యలకు పరిష్కారాల్ని వెతికే ప్రయత్నం చేయాలన్నారు. విద్యార్థులను గ్లోబల్ సిటిజన్లు (ప్రపంచ పౌరులు)గా తయారుచేయాలని సూచించారు.

ఈ  కార్యక్రమంలో నగరంలోని 18 పాఠశాలలకు చెందిన 400 మంది విద్యార్థులు పాల్గొంటారని ప్రిన్సిపల్ పార్థిపన్ తెలిపారు. బృందాలుగా ఏర్పడి విద్యార్థులు ఐక్యరాజ్యసమితి సాధారణ సభ కలాపాలు నిర్వహిస్తారన్నారు.

ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను జేపీ తదితరులు అభినందించారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

సెప్టెంబర్ 1-15, 2018 | సంపుటి - 9 | సంచిక - 17





నిజమే మా దగ్గర ఖైదీలంతా మంచి మార్కులతో పాసవుతున్నారు. కాని మీవాణ్ని జైల్లో పెట్టి చదివించటం కుదరదు.

## కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...


అవినీతి నిరోధక చట్టానికి ప్రజావ్యతిరేక............ 5
అసంబద్ధ సవరణలు.................................... 6
'బాధిత ప్రజలకు శిక్ష - లంచగొండులకు రక్ష...... 8
నిరుద్యోగ భృతి వర్సెస్ జైలు సౌకర్యాలు.............. 10
డిగ్రీ, పీజీ చేసినవారు స్వీపర్ కావాలని ఎందుక.... 16
పరిష్కారం... ప్రభుత్వోద్యోగుల వేతనాలు ......... 19
సమాజానికి ఉపయోగపడే పని చేయటమే........ 21
పరాకాష్ఠకు చేరిన విలువల పతనం................. 24
ప్రజారోగ్య విధానాల వైఫల్యం - గిరిజనుల ......... 27
జాతిరత్నాలను జారవిడుస్తూ నవభారత .......... 29
స్థానిక ప్రభుత్వాలను బలహీనపరచటం వల్లే....... 32
ఎన్నికల నేపథ్యంలో లోక్‌సత్తా పార్టీ ................ 33



### సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
*ప్రధాన సంపాదకులు*

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు


## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.


**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com


## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836, **SBI** పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# ప్రసంగాలు- గొప్ప ప్రసంగాలు



దేశ ప్రధాన రాజకీయ స్రవంతిలో గత 40 ఏళ్లలోనే సమున్నత నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయీ అనటానికి సంకోచించనక్కర్లేదు. తటస్థులను, ఇతర పార్టీలవారిని ఆకర్షించటానికి అటల్‌జీని ఒక ముసుగుగా సొంత సంస్థ, పార్టీ వారు ఉపయోగించుకున్నారన్న విమర్శ- ఆయన కృషిని, స్థాయిని ఎంతమాత్రం తగ్గించలేవు. విధిలేని పరిస్థితుల్లో మాత్రమే కాకుండా.. ఒక అవగాహన, దేశ భవిష్యత్తు పట్ల దీర్ఘకాలిక దృష్టితో ఆయన ప్రధానమంత్రిగా సంస్కరణల్ని అమలు చేశారు. వ్యక్తిగత పలుకుబడిని పెంచుకోవటాన్ని, రాజకీయ ఎత్తుగడలను వేయటాన్ని కూడా ఆయన ఎప్పుడూ లక్ష్యశుద్ధితో ముడిపెట్టే చూశారు. రాజ్యాంగ విరుద్ధం అనిపించుకోకుండానే 1999లో లోక్‌సభలో అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గే అవకాశం ఉన్నా కూడా.. ఆయన దూరదృష్టితో నైతిక రాజకీయ కోణానికి కూడా అమిత ప్రాధాన్యతనిచ్చారు. అందుకే వయసు పైబడి, అనారోగ్యంతో మరణించినా కూడా.. ఆయన పట్ల యావత్ దేశం సానుకూలతతో, ఆరాధనాభావంతో స్పందించింది. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు కూడా వాజ్‌పేయీ విలువను మరింత పెంచాయనుకుంటే తప్పేమీ లేదు. ఎమ్మెల్యేలు, ఎంపీల కొనుగోళ్లు, దోపిడీ ఒప్పందాలతో ఫిరాయింపుల రాజకీయాన్ని గతిలేదన్నట్టు చూస్తున్న యువతరం.. 'వాజ్‌పేయీ అనే నాయకుడు ఎటువంటి కొనుగోళ్లూ చేయకుండా ఒక్క ఓటు తేడాతో ప్రధానమంత్రి పదవిని కోల్పోయారని' సంభ్రమాశ్చర్యాలతో సోషల్ మీడియాలో చర్చించుకున్నారు. స్వచ్ఛతను, ఆర్ద్రతను కోల్పోకుండా సహానుభూతితో వ్యవహరించే శక్తిని క్రియాశీల రాజకీయాల్లో తుదికంటా నిలబెట్టుకున్న అతికొద్దిమంది నాయకుల్లో వాజ్‌పేయీ ఒకరు. రాజకీయాన్ని, పాలనను, పదవీ బాధ్యతల్ని ఈవెంట్ మేనేజ్‌మెంట్లుగా భావిస్తున్న ఈరోజుల్లో.. అలా ఏరోజుకారోజు స్పందించే శక్తితో వ్యవహరించే వాజ్‌పేయీలాంటి వాళ్ల గురించి పనిగట్టుకునైనా చెప్పుకోవాలి. మూడు రాష్ట్రాల విభజనను కూడా ఎంతో సున్నితంగా, ముందుచూపుతో, జాతీయ దృష్టితో చేశారాయన. అటల్ సుదీర్ఘ రాజకీయ జీవితం, పార్టీలకతీతంగా, ప్రధానమంత్రిగా సాధించిన విజయాలు, పాకిస్తాన్, కాశ్మీర్ వంటి అంశాల్లో వ్యవహరించిన తీరుపై తాజాగా కూడా విస్తృతంగా కథనాలు వెలువడ్డాయి. వాటన్నిటిలోకీ మళ్లీ వెళ్లక్కర్లేదుగానీ.. ప్రజల్ని సమ్మోహితుల్ని చేసే ఉపన్యాసకునిగా ఆయన గురించి వెల్లువెత్తిన ప్రశంసల గురించి మాత్రం కొంత ప్రస్తావించుకోవాలి. అటల్‌జీకి ఏమాత్రం తీసిపోనిరీతిలో గొప్ప ఉపన్యాసకునిగా ప్రస్తుత ప్రధాని, బీజేపీ నేత నరేంద్రమోదీ కూడా పేరు తెచ్చుకున్నారు. వాజ్‌పేయీ మృతికి ఒక్కరోజు ముందు ఎర్రకోట మీద 80 నిముషాల పాటు మోదీజీ అనర్గళంగా ప్రసంగించారు. కానీ ఇద్దర్నీ సమస్థాయి ఉపన్యాసకులుగా భావించగలమా? అనే ప్రశ్న తలెత్తక మానదు. గొప్ప ఉపన్యాసమంటే.. గంభీరమైన గొంతు, వాగ్ధాటి, పసందైన పదాలు-యతిప్రాసలు, హావభావాలు మాత్రమే కాదు.. అందులో అణువణువునా లక్ష్యశుద్ధి ఉండాలి. రాజకీయాల్లో, ప్రజాజీవితంలోనైతే.. దీర్ఘకాలిక దృష్టి, సమాజ అవసరాల పట్ల స్పష్టమైన అవగాహన, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేయగల నైపుణ్య విధానాలు ప్రసంగాల్లో పాదుకొని ఉండాలి. 2014లో ఎన్నో ఆశల మధ్య అసాధారణ ప్రజామద్దతుతో ఎన్నికైన మోదీ.. తన పార్టీ విజయాన్ని దేశ ప్రజల విజయంగా మార్చటంలో కేవలం స్వయంకృతాపరాధాల వల్ల విఫలమయ్యారు. వ్యక్తిగత నిజాయతీలో వాజ్‌పేయీకి ఏమాత్రం మోదీ తీసిపోరు. కానీ, యువజనాభాతో వేగంగా ఎదుగుతున్న భారతదేశాన్ని సుస్థిర అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లే సదవకాశాన్ని వినియోగించుకునే పరిణతిలో మాత్రం తీసికట్టయ్యారు. ప్రభుత్వాలు చేయాల్సిన మౌలికమైన పనులు.. చట్టబద్ధపాలన, ప్రతి బిడ్డకీ నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిరహిత సేవలు వంటివి భారతదేశంలో ఇకనైనా సజావుగా సాగేలా సుపరిపాలన నిర్మాణం చేయలేకపోయారు. లోక్‌పాల్ నియామకాన్ని నిర్లక్ష్యం చేయటమేకాకుండా, ప్రజల సాధికారతను బలహీనపరిచేలా అవినీతి నిరోధక చట్టానికి తిరోగమన సవరణల్ని తీసుకొచ్చారు. ఆరోగ్యరంగంపై 'ఆయుష్మాన్ భారత్' పేరుతో ఓ పెద్ద ముందడుగును వేశారుగానీ.. ఖజానా ఖాళీ చేయటం తప్ప ప్రజలకు ఆరోగ్యాన్ని అందించలేని ఆరోగ్యశ్రీ నమూనాలో దాన్ని రూపొందించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఆరోగ్యశ్రీ ఉంది, జమిలి ఎన్నికలు కూడా జరుగుతున్నాయి.. కానీ ఈ రాష్ట్రాల్లో ప్రజలకు ఆరోగ్యం ఎందుకు అందటం లేదు? సుపరిపాలన ఎందుకు వేళ్లూనుకోలేదు? అన్న ఆలోచనే కరువైంది. గత ప్రభుత్వ చట్టాలనే కాస్త అటూ ఇటూ తిప్పి చిన్న చిన్న విజయాలను ఘనంగా ప్రచారం చేసుకుంటున్నారు. 'ఈవేళ మోదీ ప్రజాదరణ చెక్కుచెదరకుండా ఉండటానికి మీడియాలో ఆయనకు వ్యతిరేకంగా సహేతుక కథనాలను రాసే వాతావరణం లేకుండా చేయటం కూడా ఒక ప్రధాన కారణం' అని సీనియర్ సంపాదక మిత్రుడొకరు ఇటీవల చేసిన వ్యాఖ్యను కొట్టిపారేయలేం. ఎన్నికలకు ముందు సంవత్సరంలో ఎర్రకోట మీద నుంచి ప్రసంగించేటప్పుడు.. వాగ్వాదంలో పైచేయి సాధించటమన్నట్టు కాకుండా- విద్య, వైద్యం, చట్టబద్ధపాలన, ఉపాధి, వ్యవసాయం వంటి రంగాల్లో లోపాల్ని దిద్దుకునేలా మోదీజీ మాట్లాడి ఉంటే.. అది గొప్ప ప్రసంగం అయి ఉండేది. కేవలం ఒక పార్టీ నాయకుడిలా, ఓ వ్యక్తిత్వ వికాస నిపుణుడిలా కాకుండా.. దేశ నాయకుడిలా, సమాజ వికాస నిపుణుడిలా మాట్లాడారు కాబట్టే వాజ్‌పేయీ గొప్ప ఉపన్యాసకునిగా పేరును సుస్థిరం చేసుకున్నారు. ప్రతి వాక్చాతుర్యమూ గొప్ప ప్రసంగం అయిపోదని నేటి నాయకులు వాజ్‌పేయీజీని చూసి గ్రహించాలి. బహిరంగ చర్చల్లో వాజ్‌పేయీ ప్రతి మాటా, స్పందనా ఎంత సంస్కారవంతంగా, అర్థవంతంగా, ప్రజాస్వామ్యయుతంగా ఉంటాయో సోషల్ మీడియా యువత గమనించాలి. 'ప్రజలకు ఎంత లాభం?' అన్నదే.. నాయకుల, ప్రసంగాల గొప్పతనానికి అంతిమంగా గీటురాయి! దేశ పరిస్థితులకు-రాజ్యాంగానికి మధ్య ఉన్న అగాధాన్ని అధిగమించి ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు కావలసిన వ్యవస్థల నిర్మాణం చేయకుండా కేవలం నాయకులు, వారి నిజాయతీ మీద ఆధారపడటమనే తప్పిదాన్ని స్వతంత్రం వచ్చిననాటి నుంచీ నేతలు దేశంలో కొనసాగిస్తున్నారు. ఈ తప్పిదాన్ని సరిచేసి.. నివారించదగ్గ బాధలను తొలగించేలా, వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాల్ని కల్పించేలా సరైన వ్యవస్థల నిర్మాణాన్ని వాజ్‌పేయీ కూడా చేయలేకపోయారు. కానీ 2004లో అటల్‌జీ ఓడిపోకుండా ఉంటే.. ఈ దేశం ఇంకా మెరుగైన వృద్ధిని సాధించేది, వ్యక్తి స్వేచ్ఛ ఇంకా వికసించేది, జనహితకరమైన వ్యవస్థల నిర్మాణానికి తగిన వాతావరణం నెలకొనేది అనటంలో మాత్రం ఎటువంటి సందేహం లేదు.




లంచం ఇస్తే లోపలేశారు.. మళ్లీ లంచం ఇస్తే బయటికి తోసేస్తారా సార్?!





లంచం ఇవ్వకపోయావో ఇస్తానన్నావని చెబుతా జాగ్రత్త!

## అవినీతి నిరోధక చట్టానికి ప్రజావ్యతిరేక సవరణలు.... పార్లమెంటులో కలిసికట్టుగా ఆమోదించిన పార్టీలు




ఇచ్చినతను కూడా
ఎక్కడా చెప్పడు! ఇంకా హ్యాపీ!!



# అసంబద్ధ సవరణలు

- యం.వి.జి అహోబలరావు




అవినీతి నిరోధక చట్టానికి పార్లమెంటు చేసిన సవరణలు ఏమాత్రం సరైన రీతిలో లేవు. లంచం తీసుకునే ప్రభుత్వ ఉద్యోగితో బేరం కుదరని సందర్భాలలో లంచం ఇచ్చిన, ఇవ్వబోయిన సామాన్యుడిని బ్లాక్‌మెయిల్ చేసే అవకాశాన్ని ఈ చట్టం కల్పిస్తుంది. లంచగొండి ప్రభుత్వ ఉద్యోగికి తాను అవినీతి కేసుల నుండి ఎలా బైటపడాలో బాగా తెలుసు. అతనికి ఎలాగూ రాజకీయం అండ వుండనే ఉంటుంది. ఇక అమాయకంగానో, అత్యవసరంగానో, అనివార్యంగానో లంచం ఇవ్వక తప్పని పరిస్థితులలో లంచం ఇవ్వజూపిన సామాన్యుడిది కూడా తప్పే అయినా, అతనికి చట్టంలో ప్రతిపాదించిన స్థాయిలో శిక్షలు విధించడం సమంజసం కాదు. ఈ సవరణ వల్ల లంచగొండి అధికారికే తనకు లంచం ఇచ్చిన, ఇవ్వజూపిన సామాన్యుని బ్లాక్‌మెయిల్ చేస్తూ బెదిరించే అవకాశాలు ఏర్పడతాయి. ఈ విషయంలో అమాయకులైన గ్రామీణులే ఎక్కువగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఇటువంటి సందర్భాలలో తప్పించుకునే వెసులుబాటు ప్రభుత్వోద్యోగికి ఉన్నంతగా సామాన్యునికి ఉండదు.

ప్రభుత్వాధికారులెవరైనా లంచం తీసుకున్నట్లు ఫిర్యాదు వస్తే వారిని విచారించడానికి పై అధికారుల ఆమోదం తప్పనిసరి అనడం ఏ మాత్రము సమర్థనీయం కాదు. ఇంకా నయం– స్థానిక ప్రజాప్రతినిధి అనుమతి తప్పనిసరి అని అనలేదు! అయినా, ఏ అధికారి అయినా ఇటువంటి విచారణకు అనుమతి ఇవ్వాలన్నా, నిరాకరించాలన్నా స్థానిక ప్రజాప్రతినిధి జోక్యం లేకుండా సాధ్యపడుతుందా? ఇటువంటి విషయాలలో పై అధికారులపై అనేక రకాల వత్తిళ్లు రాజకీయ నేతలతోపాటు ఉద్యోగ సంఘాల నుండి కూడా రావడం జగమెరిగిన సత్యమే. ఈ అనుమతి అవసరమనే నిబంధన వల్ల రాజకీయాలతో అంటకాగే అధికారుల పంట పండినట్లే అవుతుంది. విచారణకు అనుమతి ఇవ్వవలసిన పై అధికారికి వెళ్లవలసిన వాటాలు పెరుగుట వల్ల సామాన్యుడు చెల్లించవలసిన లంచాల పరిమాణం భారీ స్థాయిలో పెరుగుతుంది. ఈ చట్ట సవరణ వల్ల నిజాయితీపరులైన ఉద్యోగులపై నకిలీ ఫిర్యాదుల ఇబ్బందులు తగ్గుతాయనే వాదనలో వన లేదు. వాస్తవానికి నిజాయతీపరులు ఇబ్బందులు పడేది రాజకీయ నాయకుల వల్లనేనన్నది జగద్విదితం! అవినీతి అధికారులపై అన్ని సాక్ష్యాధారాలూ సేకరించి అవినీతి నిరోధక శాఖ వారు వివిధ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు అనుమతి కోసం రాసిన లేఖలు వేల సంఖ్యలో సంవత్సరాల తరబడి సచివాలయాలలో చెదలు పట్టి ధ్వంసం కావడం వాస్తవం కాదా?

ప్రస్తుతం వందమంది అవినీతి ఉద్యోగులలో అవినీతి నిరోధక శాఖకు చిక్కేవారు కేవలం రెండు శాతానికి మించి ఉండరు. వాటిలో సగానికి పైగా కేసులు కోర్టులలో వీగిపోతాయి. చాలా కేసులలో తీర్పులు అవినీతి అధికారులు మరణించిన తర్వాతనే వెలువడుతున్నాయి. ఇందువల్ల శిక్షలు పడ్డా వాటిని అనుభవించేవారి సంఖ్య అత్యల్పమే! నేరపూరిత దుష్ప్రవర్తన నిర్వచనంలో– అక్రమార్జన, ఆస్తుల దుర్వినియోగంతోపాటు ఆశ్రిత పక్షపాతం, కుల తత్వం, మత తత్వం, ప్రాంతీయ తత్వం వంటి పదాలను కూడా అదనంగా చేర్చవలసిన అవసరం ఉంది. అవినీతిపరుల ఆస్తులను జప్తు చేయడం వారి రిటైర్మెంట్ తర్వాతి కాలానికే కాక మరణానంతరానికి కూడా వర్తింపచేయాలి. ఎందుకంటే ఎన్నో దుర్వ్యసనాలకు బానిసలైన అవినీతిపరులు పదవీ విరమణ చేసిన స్వల్పకాలానికే

మరణించే అవకాశం ఉంటుంది. వీరు ఆర్జించిన వందల కోట్ల ప్రజాధనం వాళ్ల వారసులకు దక్కనీయడం ఏమాత్రమూ సమంజసం కాదు.




విచారణకు ముందస్తు అనుమతి తప్పనిసరి అనే ప్రతిపాదన అవినీతి నిరోధక శాఖ ముందు కాళ్లకు బంధం వేసినట్లేనని ఈ రంగంలో ఏ పాటి పరిజ్ఞానం ఉన్నవారికైనా ఇట్టే అర్థమవుతుంది. లంచం తీసుకుంటూ వుండగా ఏసీబీకి పట్టుబడిన వారి విషయంలో ముందస్తు అనుమతి అవసరం లేదనే అంశం గుడ్డిలో మెల్లగా ఉంది. అయితే వందలు, వేల కోట్ల అక్రమార్జనను వివిధ మార్గాలలో కూడబెట్టిన అవినీతి తిమింగలాల విషయంలో దాడి చేసే ముందు కూడా పైవాళ్ల అనుమతి, ముందస్తు నోటీసు వంటి సరళతర సవరణలను ప్రతిపాదించారో లేదో తెలియదు. ఇది కూడా చేస్తే రాబోయే ఎన్నికలలో అధికార పార్టీలకు ఉద్యోగులు, అధికార వర్గాల నుండి అపార సహాయ సహకారాలు లభిస్తాయి.

గతంలో ఒక ముఖ్యమంత్రి ఉద్యోగ వర్గాలను ప్రసన్నం చేసుకోవడానికి రెడ్‌హ్యాండెడ్ కేసులతో అడ్డంగా దొరికిపోయిన అవినీతి ఉద్యోగులను కూడా వెంటనే అరెస్టు చేయరాదని ఉత్తర్వులు ఇవ్వగా అదృష్టవశాత్తూ ఆ ఉత్తర్వును హైకోర్టు విజ్ఞతతో రద్దు చేసిన విషయం ఇప్పుడు గుర్తుకు వస్తోంది.

ఓట్ల కోసం వేల కోట్ల రూపాయలను నగదు, వస్తువు, మద్యం రూపేణా పంపిణీ చేసే పార్టీల కార్యకర్తలు కూడా ఈ సవరణల వల్ల శిక్షార్హులు అవుతారో, లేదో స్పష్టం చేయవలసిన అవసరం ఉంది. కేవలం ఓట్ల కోసమే ఉచితాలు, రాయితీల రూపంలో ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేస్తున్న అధికార పార్టీలు లంచం ఇచ్చే పార్టీలుగా శిక్షార్హం అవునో కాదో కూడా స్పష్టం చేయాలి. ✳

## సైబర్ నేరాలను కట్టడి చేయండి



రాష్ట్రంలో సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్నాయని, వాటి కట్టడికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోలేకపోతోందని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. గత రెండేళ్లలో 3,000 కేసులు నమోదైనా 250 మాత్రమే ఛేదించగలిగారన్నారు. విజయనగరంలో సైబర్ నేరాల జోరు పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పదవీ విరమణ చేసిన వారు సైబర్ మోసాల బారిన పడి నిస్సహాయంగా విలపిస్తున్నారన్నారు. ఆ తరహా నేరాలపై ప్రజల్లో అవగాహన చాలా తక్కువగా ఉందని, ప్రజాచైతన్య కార్యక్రమాలతోపాటు సైబర్ నేరాల కట్టడికి ప్రత్యేక నియామకాల్ని చేపట్టాలని జిల్లా ఎస్పీ పాలరాజుని కలిసి బాబ్జీ విజ్ఞప్తి చేశారు.

## గరిమెళ్ల పేరును చిరస్మరణీయం చేయాలి

'మాకొద్దీ తెల్లదొరతనం' అంటూ బ్రిటీషువారిని హడలెత్తించిన ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు గరిమెళ్ల సత్యనారాయణ పేరును ఏదోక ప్రముఖ విద్యాసంస్థకు పెట్టాలని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు, విజయనగరం జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజ్ఞప్తి చేశారు. గరిమెళ్ల 125వ జయంతి సంవత్సరం సందర్భంగా పౌరవేదిక నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వేదిక ప్రతినిధులు రామారావు, గురునాథం, పీఎల్ఎం రాజు, సూర్య, శిమ్మ శ్రీను, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# 'బాధిత ప్రజలకు శిక్ష - లంచగొండులకు రక్ష' .. ఇదేనా సుపరిపాలన?

- కూసంపూడి శ్రీనివాస్



'ఇప్పుడు సుపరిపాలన (సురాజ్యం) మన జన్మహక్కు అని కోరే సమయం ఆసన్నమయింది. ప్రతీ భారతీయుడు సుపరిపాలన ఫలాలు పొందాలి. నవభారత నిర్మాణం కోసం మేం చేస్తున్న ప్రయత్నాల అంతిమ లక్ష్యం కూడా ఇదే'- ఈ మధ్య దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు ఇవి. అయితే సుపరిపాలన గురించి మాటలు చెప్పడం వేరు, ఆచరించి చూపడం వేరు. ఈ విషయం అర్థమయినా అర్థంకానట్లు నటించడంలో మోదీ పరిణతి చెందారు. ప్రజలకు ఈ ఎన్నికల్లో ఏం చెప్పామో వచ్చే ఎన్నికలనాటికి గుర్తుండదు. మధ్యలో ఒకటో రెండో సంచలనాలు, ఎన్నికలప్పుడు ఒక భారీ సంచలనం ఉంటే చాలు.. వారిని ఏమార్చవచ్చు అని మోదీ భావిస్తున్నట్లున్నారు. రోజుకో సంచలనం లేకపోతే, ఓ సోషల్ మీడియా పోస్టింగ్ చేయకపోతే నిద్రపట్టని ఈ రోజుల్లో నాలుగేళ్ల క్రితం మోదీని ఎందుకు గెలిపించామో స్పష్టంగా గుర్తుండడం చాలామంది విషయంలో అనుమానమే. మోదీ ధైర్యం కూడా అదే. పంద్రాగస్టు నాడు ఏం మాట్లాడాలో చెప్పండని ప్రజలని అడగడంలో ఆయన ఆంతర్యం కూడా అదే కావచ్చు.

'ప్రజాస్వామ్యం నిజంగా పార్లమెంట్ బయటే ఉంది. 125 కోట్ల ఐడియాలున్న దేశం మనది' అని పైకి ఎంత ఉదాత్త పలుకులు పలుకుతున్నా, ఆచరణలో ఇందిరాగాంధీ కాలంనాటి కేంద్రీకృత రాజకీయాలనే మోదీ కొనసాగిస్తున్నారు. అందుకే నాలుగేళ్ల అనంతరం కూడా మోదీ ఎన్నికల విజయాలు ఈ దేశ విజయాలుగా మారలేదు. ఈ వర్షాకాల సమావేశాల్లో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాలను చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. వాటిలో మొదటిది.. అవినీతి నిరోధక చట్టం 1988కి చేసిన సవరణలు. ఆ సవరణల వల్ల ఈ చట్టం లంచగొండి అధికారులకు వరంగా మారింది. అదేవిధంగా అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లులోని సెక్షన్ 8 ప్రకారం లంచం ఇవ్వచూపడం నేరపూరిత చర్య. వారి విధులు నిర్వర్తించడానికి ప్రభుత్వాధికారులకు లంచం ఇవ్వచూపడం, ఇస్తానని వాగ్దానం చేయడం, ఇవ్వడాల్ని విచారణకు అర్హమైన నేరంగా పరిగణిస్తారు. లంచం ఇచ్చేవారికి రక్షణ కల్పించేందుకు సెక్షన్ 8లోని సబ్ సెక్షన్ని ప్రతిపాదించారు. అయితే, లంచం ఇచ్చేవారు ముందుగా చట్టానికి తెలియచేయడం, దర్యాప్తు సంస్థకు ఉప్పందించడం వల్ల మాత్రమే వారికి ఈ రక్షణ లభిస్తుంది. కానీ రోజువారీ సేవల కోసం సాధారణ పౌరులు బలవంతంగా, గత్యంతరం లేక ఇచ్చే లంచాల నుంచి రక్షణను మాత్రమే ఈ సవరణలు ప్రస్తావించలేదు. తమకు హక్కుగా అందాల్సిన సేవల కోసం గతి లేక బలవంతంగా లంచాలిచ్చే సామాన్య పౌరులకు కూడా జైలు శిక్షను ఈ సవరణల్లో తప్పనిసరి చేశారు. మరోవైపు, లంచం తీసుకునేవారిపై కనీసం పోలీసు దర్యాప్తు చేయాలన్నా ముందస్తు అనుమతి కావాలన్నారు. 'బాధిత ప్రజలకు శిక్ష- లంచగొండులకు రక్ష' అన్న చందంగా ఉంది ఈ చట్ట సవరణ.

ఇక రెండవది.. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంలోని కొన్ని నిబంధనలను పునరుద్ధరిస్తూ చేసిన రాజ్యాంగ సవరణ బిల్లు. ఈ చట్టం దుర్వినియోగం అవుతోందని అభిప్రాయపడుతూ, దాన్ని నివారించడం కోసమని మొన్న మార్చిలో జస్టిస్ ఏకే




గోయల్, జస్టిస్ లలిత్‌ల నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసినప్పటి నుంచీ దళిత వర్గాల్లో ఆందోళన ఏర్పడింది. ప్రభుత్వం దళితులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నదన్న ప్రచారంతో ఆందోళనకు గురై చట్టంలోని పాత నిబంధనలను పునరుద్ధరించడానికి ఆమోదముద్ర వేసింది బిజెపి ప్రభుత్వం. ఎస్సీ, ఎస్టీ రక్షణకు చట్టపరంగా ప్రత్యేకమైన ఏర్పాటు ఉండాలనడంలో మరోమాటకు ఆస్కారం లేదు. దాంతోపాటు చట్టం దుర్వినియోగమై అమాయకులు బలైపోకుండా తగిన రక్షణ కూడా పకడ్బందీగా ఉండాలి. చట్టాన్ని తిరిగి యధాతథంగా ఉంచుతూ ఆర్డినెన్స్‌ను తెచ్చి ఆందోళనలను తాత్కాలికంగా చల్లబరచవచ్చు కానీ, తప్పు చేస్తే శిక్ష పడుతుందన్న భయం కల్పించకుండా చట్టాలు చేసినంత మాత్రాన ఉపయోగమేమీ ఉండదు.

మూడవది.. ఓబీసీ ఉపవర్గీకరణ హడావుడి. డిమాండ్ ఉన్న కోర్సుల్లో, ఉద్యోగాల్లో తమకు రావాల్సిన అవకాశాల్ని రిజర్వేషన్ల పేరుతో లాగేసుకుంటున్నారని కొందరు భావిస్తుంటే, రిజర్వేషన్లు ఉన్నా తమకు న్యాయం జరగడం లేదని ఇంకొందరు ఆవేదన చెందుతున్నారు. సామాజిక, ఆర్థికపరమైన ఈ దీర్ఘకాలిక సమస్యను చర్చించి పరిష్కరించే ప్రయత్నంలో ఇప్పటికే చాలా జాప్యం జరిగింది. ఓబీసీ వర్గీకరణ అవసర మనడంలో సందేహం లేదు. ఓబీసీలకు ఏదో పెద్ద మేలు చేస్తున్నట్లు కనిపించడం వల్ల గుజరాత్ సహా ఉత్తరాది రాష్ట్రాల్లో బిజెపికి ఎన్నికల లబ్ధి కలగవచ్చు. కానీ మోదీ ప్రభుత్వం వాస్తవిక పరిపాలన అంచనాలను అందుకోవడంలో మరోసారి విఫల మయింది. ఓబీసీ ఉపవర్గీకరణకు ప్రత్యేకించి కమిషన్ వేసి కొన్ని వారాల్లోగా నివేదికను తెప్పించుకుని ఏదోరకంగా అమలు చేసేయగలరు కానీ, దానితో దేశం వైపు దూసుకొస్తున్న ఉద్యోగ సంక్షోభం ఆపగలరా? నేడు యువతకు కావాల్సింది ఉద్యోగావకాశాలే. ఉద్యోగాల కోసం నెలకు కొత్తగా వస్తున్న 10 లక్షల మంది కోపంతో, కసితో హింస, దోపిడీలకు దిగితే పరిస్థితి భయానకంగా తయారవుతుంది. రిజర్వేషన్లు కల్పించినా ఉద్యోగాలు ఎక్కడి నుంచి వస్తాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేసిన వ్యాఖ్యను పూర్తిగా తోసిపుచ్చలేం. ప్రభుత్వం ప్రజల పక్షాన చిత్తశుద్ధితో ఆలోచించి వ్యవహరిస్తేనే ఉద్యోగాల సృష్టి సాధ్యమవుతుంది. కానీ మోదీ ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయకపోవడం దురదృష్టకరం.

మోదీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాల పరిధి ప్రశ్నార్థకంగా మారిపోయింది. కేంద్రం అధికారాలు, రాష్ట్రాల హక్కుల మధ్య సమస్యలు పెచ్చరిల్లాయి. మన తెలుగు రాష్ట్రాల పరిస్థితే సరైన ఉదాహరణ. పార్లమెంట్ సాక్షిగా ఆమోదించిన బిల్లుకి, ప్రధానమంత్రి ఇచ్చిన హామీకి విలువ లేకుండా పోయింది. ప్రణాళికా సంఘం స్థానంలో ప్రవేశపెట్టిన నీతిఆయోగ్ అసలు లక్ష్యం– రాష్ట్రాలు బలంగా ఉంటేనే బలమైన దేశం ఏర్పడుతుందనే సహకార సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా వ్యవహరించడం. ఈ లక్ష్యానికి అర్థమే లేకుండా పోయింది. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ తనకు నచ్చినట్లు పనిచేస్తాననట్టు వ్యవహరించడం ఏం సుపరిపాలన? దేశమంతటినీ హిందీ, హిందుత్వాలోకి మార్చాలని మోదీ భావిస్తున్నారు. రోబో తరహాలో మోదీ, ఆయన పార్టీ మారతా మంటే అది వారి ఇష్టం. ప్రజాస్వామ్యానికి నియంతృత్వం ప్రత్యామ్నాయం కాదని మోదీ గుర్తుంచుకోవాలి. మోదీ ఫార్ములా కొంతకాలం పనిచేయొచ్చు. కానీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, రాష్ట్రాలకు మరింత స్వయం ప్రతిపత్తి, స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు, చట్టబద్ధపాలన అందించ కుండా, దేశాన్ని గుప్పెట్లో పెట్టుకోవాలను కుంటే.. ఆయనకు, ఆయన పార్టీకి చేటు చేసుకోవడమే కాకుండా, దేశానికి తీవ్ర నష్టం చేసినవారవుతారు. ✳

# నిరుద్యోగ భృతి వర్సెస్ జైలు సౌకర్యాలు




*"నిజామాబాద్ అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఉప్పల రవి (39) బీకాం చదువు మధ్యలోనే మానేశాడు. ఓ ప్రైవేటు సంస్థలో మార్కెటింగ్ పని చేస్తున్నాడు. గతంలో చోరీ చేసి ఏడాదిపాటు జైలుకి వెళ్లచ్చాడు. జైలులో సమయానికి భోజనం, ఓ అధికారి వద్ద చేస్తున్న పనికిగాను.. నెలకు రూ.2,000 జీతం లభించేది. బైటికి రావటంతో జీవితం గగనమైంది. దీంతో దొంగతనానికి ప్లాన్ చేసుకున్నాడు. హైదరాబాద్ ఎల్బీనగర్ సమీపంలోని ఆర్టీసీ కాలనీలో యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం వద్ద మన్సూరాబాద్‌కు చెందిన ఉపేందర్‌రెడ్డి రూ.17,500 డ్రా చేసి బయటకు వచ్చి లెక్కిస్తున్నాడు. ఇదే అదనుగా భావించి అక్కడే ఉన్న ఉప్పల రవి.. నగదు లాక్కుని పారిపోబోయాడు. స్థానికుల సాయంతో ఉపేందర్‌రెడ్డి అతన్ని వెంటనే పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. నగదును బాధితునికు ఇచ్చేసిన పోలీసులు తనను సైతం విడిచిపెడతారేమోనని భావించిన రవి.. జైలు జీవితమే హాయి అనుకున్నట్టు.. తనను ఎట్టి పరిస్థితుల్లోనూ జైలుకు పంపాలంటూ పోలీసు అధికారి కాళ్లు పట్టుకుని బతిమాలాడు. నివ్వెరపోయిన ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని జైలుకి పంపారు".*

.. వార్తాపత్రికలో ఆమధ్య వచ్చిన ఈ కథనాన్ని చదివిన వెంటనే చిన్నప్పుడెప్పుడో స్కూలులో చదువుకున్న ఓ. హెన్రీ కథ 'ది కాప్ అండ్ ది యాంథమ్' (అరెస్టయ్యేందుకు ప్రయత్నం) గుర్తుకొచ్చింది. ఆ కథ 114 ఏళ్ల క్రితం 'న్యూయార్క్ వరల్డ్' ఆదివారం సంచికలో ప్రచురితమైంది. అమెరికా నుంచి విశ్వవ్యాప్తమైంది. పలు దేశాల్లో స్కూలు పాఠ్యాంశమైంది. ఓసారి కథను గుర్తుచేసుకుంటే..

*'ది కాప్ అండ్ ది యాంథమ్'లో కథానాయకుడు సోపీ. పార్కుల్లో బెంచీల మీద జీవనం సాగిస్తుంటాడు. అలా న్యూయార్క్ మ్యాడిసన్ స్క్వేర్‌లో ఓ బెంచీ మీద పడుకుని ఉన్నప్పుడు చెట్టు మీద నుంచి ఒక ఆకు రాలి పడుతుంది. కాళ్ల మీద, ఛాతీ మీద పాత వార్తాపత్రికల్ని కప్పుకున్నా కూడా చలి ఆగదు. ఇలా కొన్ని సన్నివేశాల్ని చూశాక.. శీతాకాలం మొదలైందని ధృవీకరించుకుంటాడు సోపీ. ఈ చలిలో పార్కులో పడుకోవటం కష్టమనుకుంటాడు. మూడు నెలలపాటు తనకు భోజనం, చలి లేకుండా వసతి కల్పించే స్థలం*

## నిరుద్యోగాంధ్ర

ఆంధ్రప్రదేశ్‌లోని యువతీయువకుల్లో 45శాతం మంది ఉపాధికి దూరంగా ఉన్నారని ప్రభుత్వం చేయించిన ప్రజాసాధికార సర్వేలో తేలింది. రాష్ట్రంలో మొత్తం 65,01,846మంది నిరుద్యోగులున్నట్టు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. వీరు 18 నుంచి 35 ఏళ్లలోపు వారు. వీరిలో.. చదువులు పూర్తి చేసుకున్నా ఉద్యోగం లేక ఖాళీగా ఉన్న వారి సంఖ్య 20,19,519. వీరంతా పదో తరగతి, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిప్లొమా, గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారేనని సర్వేలో తేలింది. చదువుకునే ఆర్థిక స్తోమతు లేక మధ్యలోనే చదువు నిలిపేసిన యువత 9,17,653మంది ఉన్నారు. పదో తరగతి లేదా ఇంటర్మీడియెట్, గ్రాడ్యుయేషన్ మధ్యలో వీరంతా చదువు మానేశారు. మరోవైపు, పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, గ్రాడ్యుయేషన్, పీజీ చదువుతున్నవారు 22,71,629మంది ఉన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు 12,93,405మంది చదువురాని నిరుద్యోగులుగా ఉన్నారని తేలింది. చదువుకుని అసంఘటితరంగంలో పనిచేస్తున్న యువత 12.62 లక్షల మంది ఉన్నారు.

*ఎక్కడ దొరుకుతుందా అని ఆలోచిస్తాడు. న్యూయార్క్‌లో కొన్ని చోట్ల ఉన్న ఆశ్రయమిచ్చే భవనాలు గుర్తుకొస్తాయి. కానీ అక్కడికెళ్తే తన వివరాలన్నీ క్షుణ్ణంగా చెప్పటం, వారు విధించిన షరతుల్ని పాటించటం వంటి నియమాలు గుర్తొచ్చి విముఖత ఏర్పడుతుంది. చివరకు బ్లాక్‌వెల్స్ ఐలాండ్‌లోని జైలు మీద దృష్టిసారిస్తాడు. అక్కడైతే తననెవరూ డిస్టర్బ్ చేయరు. పొద్దున్నే అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం భోజనం, రాత్రివేళ వెచ్చగా నిద్ర.. ఇలా ఏలోటూ ఉండదనుకుంటాడు. చలికాలం వేధించే మూడు నెలలపాటు ఆ జైలులో ఉండేలా ఏదైనా నేరం చేయాలని సోపీ నిర్ణయించుకుంటాడు. ఉన్నకొద్దీ ఆ ఆలోచన ఉధృతమవటంతో ఆగలేనట్టు లేచి బయల్దేరతాడు. ఒక ఖరీదైన రెస్టరెంట్‌లో భోజనం చేసి డబ్బులు ఎగ్గొడితే.. పోలీసులను పిలిచి అప్పగిస్తారని ఆశ పడతాడు. అలా రెస్టరెంట్‌లోకి వెళ్లగానే అతని బూట్లు చూసి వెయిటర్ సోపీని లోపలికి కూడా రానివ్వడు. లాభం లేదనుకుని ఒక మధ్యస్థ రెస్టరెంట్‌కి వెళతాడు. అక్కడ సోపీకి టేబుల్ వద్ద సావకాశమే లభిస్తుంది. భోజనం పూర్తి చేసి డబ్బుల్లేవని చేతులెత్తేస్తాడు. 'మీ టైం వృథా చేసుకుంటారెందుకు? పోలీసుల్ని పిలవండి' అని వెయిటర్లను తొందరపెడతాడు. నీ లెవెల్‌కి పోలీసుల దాకా ఎందుకు అన్నట్టు.. వాళ్లు సోపీని చెవి నులిమి బయటకు గెంటుతారు. ఆ తర్వాత ఓ అమ్మాయి పట్ల అనుచిత చొరవ, గొడుగు దొంగతనం వంటివి కూడా అతన్ని పోలీసులకు పట్టివ్వలేకపోతాయి. అలా నిరాశతో నడుచుకుంటూ ఓ చర్చి వద్దకు వస్తాడు. అక్కడి మంద్రసంగీతం వినగానే అతనిలోని సోమరితనం, పరాన్నజీవి బతుకు వంటి ప్రతికూల భావాల స్థానంలో*



ఉప్పల రవి

*సానుకూల భావాలు మేలుకొంటాయి. తను జీవితంలో ఎన్ని తప్పులు చేశాడో, ఎంత నిర్లక్ష్యంగా, ప్రణాళికారహితంగా వ్యవహరించాడో, ఎలా దారితప్పాడో సమీక్షించుకుంటాడు. జీవితంలో ఓటమిని గెలుపుగా మార్చుకోవాలని నిర్ణయించుకుంటాడు. జైలు స్థానంలో.. జీవితంలో గెలుపు అతనికి ముఖ్యంగా మారుతుంది. రేపట్నుంచి ఏదోక పనిచేసుకుని కష్టపడి హుందాగా బతకాలని దృఢసంకల్పంతో అనుకుంటాడు. ఇంతలో ఓ చెయ్యి అతని భుజం మీద పడుతుంది. చూస్తే, ఓ పోలీసు! 'ఏం చేస్తున్నావిక్కడ?' అంటాడు. 'ఏం చేయటం లేదు' అని కాస్త ఆత్మగౌరవ భావనతో సమాధానమిస్తాడు సోపీ. పోలీసు తీరు తనను మరింత కించపరిచినట్టు ఉండటంతో, వాగ్వాదానికి దిగుతాడు. న్యూయార్క్ పోలీసుతో వాదించినందుకు సోపీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది. తన ముందు హాజరుపరిచిన సోపీకి జడ్జీ మూడు నెలలపాటు బ్లాక్‌వెల్స్ ఐలాండ్‌లో జైలు శిక్ష విధించటం కథకు ఓ. హెన్రీ మార్కు కొసమెరుపు.*

.. ఆంధ్రప్రదేశ్‌లో 22-35 ఏళ్ల మధ్య వయసున్నవారిలో సుమారు 12 లక్షల మందికి నెలకు రూ.1000 నిరుద్యోగ భృతి ఇస్తామని తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనను, తెలంగాణలో కూడా తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు భృతిని అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇవ్వటం చూశాక.. ఉప్పల రవి ఉదంతం, సోపీ కథ- రెండూ గుర్తుకొచ్చాయి. ఎందుకంటే, నిరుద్యోగ భృతి అందుకుంటూ బయట బతికే జీవితంలో కంటే .. ఆధునిక జైలులో ఖైదీల రూపంలో ఉంటే ఎక్కువ సదుపాయాలు అందుతాయి కాబట్టి!

తెలంగాణలోని చర్లపల్లి జైలులో పలువురు ఖైదీలు ఆహ్లాదకర

### తెలంగాణలో ప్రభుత్వోద్యోగాల కోసం ఎదురు చూసేవారే 15 లక్షలు

తెలంగాణలో దాదాపు 15 లక్షల మంది వివిధ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నట్టు ఐటీ శాఖ పరిధిలో పనిచేస్తున్న టీ-శాట్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ సంఖ్య చాలా తక్కువని ఇంకా నాలుగైదు లక్షల మంది ఉంటారని కొందరు విశ్లేషకులు అంటున్నారు. వీరు కాకుండా ఏదోకరూపంలో ఉపాధిని కోరుకుంటున్న యువత మరో 10-15 లక్షల దాకా ఉంటారని అంచనా.

వాతావరణంలో జీవితాల్ని సాగిస్తున్నారు. దేశంలోని చాలామంది తలసరి ఆదాయం కంటే ఎక్కువగా ఒక్కో ఖైదీ మీద ఇక్కడ ఖర్చు చేస్తున్నారు. తెలంగాణ జైళ్లను ఇండియాలోనే ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దుతామని హోంమంత్రి మీడియా సమావేశం పెట్టి మరీ ప్రకటించారు. బైట ఉంటే ఆరోగ్య సమస్యలకు అప్పుల పాలవ్వాల్సి రావొచ్చుగానీ, ఈ జైల్లో ఉంటే ఉచితంగానే మెరుగైన వైద్యాన్ని అందిస్తారు. మాంసాహారం, గుడ్లు రెగ్యులర్‌గా ఇస్తారు. ఇవికాక పనిచేసే అవకాశాన్ని కల్పించి, అందుకు డబ్బు కూడా ఇస్తారు. లెక్కగట్టి మరీ, విడుదల చేసే సమయంలో అందిస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో రూ.5కే క్యాంటీన్లలో అందిస్తున్న భోజనం కన్నా జైళ్లలో ఇస్తున్న భోజనం ఎక్కువ ఖరీదైనది. తెలంగాణ, ఏపీల్లో రోజుకు ప్రతి ఖైదీకి భోజనం కోసం రూ.56 వెచ్చిస్తున్నారు. కేరళ లాంటి రాష్ట్రాల్లోనైతే రూ.120 ఖర్చు చేస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల జైళ్ల శాఖ ఉన్నతాధికారులు ఇటీవల హైదరాబాద్‌లో సమావేశమైనప్పుడు, ఖైదీలకిచ్చే ఆహార మెనూ మీద ప్రత్యేక శ్రద్ధతో చర్చించారు. అల్పాహారం నుంచి రాత్రి భోజనం వరకూ మార్చాలని తెలంగాణ, కేరళ, తమిళనాడు జైళ్ల శాఖ ఉన్నతాధికారులు ఆహార పట్టిక నమూనాను తయారు చేశారు. ఇడ్లీ, సాంబార్, పూరి, రాగి జావ వంటివి అల్పాహారంలో ఇవ్వాలని, ఉత్తరాది వారికైతే చపాతి, పుల్కా వంటివి ఇవ్వాలని నిర్ణయించారు. ఆదివారం చికెన్ కర్రీ, బిర్యానీ వంటివి ఇవ్వాలని తీర్మానించారు. విజయ్‌మాల్యా వంటి వారిపై కేసుల నేపథ్యంలోనో, మరో కారణం చేతో జైళ్లను సంస్కరిస్తే.. ఇవన్నీ ఇంకా మెరుగవుతాయి. అప్పుడు, నిరుద్యోగ భృతితో పాటు ప్రభుత్వం అందించే ఇతర తాయిలాలన్నిటినీ కలిపిన దానికన్నా జైల్లో సదుపాయాలే ఎక్కువగా గిట్టుబాటవుతాయి.

### ముఖ్యమంత్రి యువనేస్తం పేరుతో..

ఏపీలో యువతకు నిరుద్యోగ భృతి ఇచ్చే పథకానికి ముఖ్యమంత్రి యువనేస్తం అని పేరు పెట్టారు. దీనికి ఏటా రూ.1400 కోట్లు ఖర్చవుతుందని అంచనా. డిగ్రీ, పాలిటెక్నిక్ చేసిన నిరుద్యోగ యువత అర్హులు. దరఖాస్తుల కోసం వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ప్రజాసాధికార సర్వేలో నమోదైనవారంతా ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చు. అర్హులకు ప్రతి నెలా వెయ్యి చొప్పున బ్యాంకు ఖాతాల్లో భృతి జమ అవుతుంది. వీరి సంఖ్య 12 లక్షల దాకా ఉంటుందని భావిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తూ ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ప్రతి నెలా చెల్లిస్తున్నవారు నిరుద్యోగ భృతికి అనర్హులు. వివిధ సంక్షేమ పథకాల కింద ప్రభుత్వం నుంచి రూ.50 వేలకు మించి సబ్సిడీ తీసుకున్నవారంతా కూడా అనర్హులు. పథకం ప్రారంభించేనాటికి వయసు తక్కువ ఉన్న యువత 21 ఏళ్లకు చేరాక ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ నమోదుకు తుది గడువు విధించలేదు. నిరుద్యోగ భృతి తీసుకునే వారందరికీ అర్హత మేరకు వివిధ పరిశ్రమల్లో ఉపాధి లభించేలా అప్రెంటిషిప్ కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందిస్తుంది. పరిశ్రమల వివరాలు, వాటిలో అవసరాలను గుర్తించి నిరుద్యోగ యువతకు అప్రెంటిషిప్ అవకాశం కల్పిస్తారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అప్రెంటిస్ ప్రోత్సాహాన్ని ఈ పథకానికి అనుసంధానిస్తారు. నిరుద్యోగ భృతి అందుకునే యువత వివరాలతో జాబ్ పోర్టల్ ఏర్పాటు చేస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న కంపెనీలకు ఈ డేటాను అందుబాటులో ఉంచుతారు. నిరుద్యోగ భృతికి నమోదు చేసుకునే సమయంలోనే యువత తమకు ఇష్టమైన మూడు రంగాలను ఎంచుకునే అవకాశం కల్పిస్తారు. ఈ పథకానికి యూనివర్సిటీల సహకారం కూడా తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

### కోట్లాది యువతను అవమానించటమే

ఎంత సుపరిపాలన ఉన్న దేశంలోనైనా.. అవకాశాల్ని అందుకోలేక ఆకలితో అలమటించేవారు కొద్దిమంది ఉండే అవకాశాలుంటాయి. ఈ కొద్దిమంది కోసం ఆహారధాన్యాల్ని పంపిణీ చేయాలి, నిరుద్యోగ భృతి వంటివి తోడ్పాటుల్ని ఇవ్వాలి. అలాగే, ప్రభుత్వం చేయాల్సిన అన్ని పనుల్నీ చేశాక- అంటే అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటివి అందించాక ఇంకా డబ్బులు మిగిలితే ఉచితాల్ని, అదనపు ఆదాయంగా నగదును పంపిణీ చేయొచ్చు. వాటిని కూడా

### ఇద్దరు గ్రాడ్యుయేట్ బిచ్చగాళ్లకు జైళ్ల శాఖలో రూ. 12,000 ఉద్యోగం

అమెరికా అధ్యక్షుని కుమార్తె, సలహాదారు ఇవాంకా ట్రంప్ వచ్చినప్పుడు హైదరాబాద్‌లోని బిచ్చగాళ్లందరినీ ఏరిపారేసినట్టు రోడ్ల మీద నుంచి ఖాళీ చేయించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఇలా అప్పుడప్పుడూ చేసే దాడుల్లో భాగంగా.. వీధుల్లో బిచ్చమెత్తుకుంటున్న ఇద్దరు యువకులను జీహెచ్ఎంసీ సిబ్బంది పట్టుకుని జైళ్లశాఖకు అప్పగించారు. ఆ ఇద్దరూ గ్రాడ్యుయేట్లు అని తేలింది. అందులో ఒకరు కంప్యూటర్ సైన్స్ పట్టభద్రుడు. పునరావాస కార్యక్రమం కింద వీరికి జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నడిచే ఆయుర్వేద విలేజ్‌లో నెలకు రూ.12,000 జీతంతో అధికారులు ఉద్యోగం కల్పించారు.

ఉత్పాదకంగా చేయాలి. కానీ.. ప్రభుత్వం చేయాల్సిన పనుల్నీ చేయకుండా, నిర్భాగ్యులైన కొద్దిమందికి మాత్రమే పరిమితమూ చేయకుండా.. ఇష్టమొచ్చినట్టు, మూకుమ్మడిగా తాయిలాల్ని, ఉచితాల్ని, రుణమాఫీల్ని, భృతుల్ని ప్రకటించటం మాత్రం కేవలం ఓట్ల కోసమే. దేశం ఎలా నాశనమైనా, భావితరాలు ఎంత నష్టపోయినా తాము, తమ వాళ్లు సుఖంగా ఉంటారనే తెగింపు ధోరణితో, భ్రమతోనే. కులం, గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అంతరాల్ని పరిష్కరించకుండా వాటిని ఓటు బ్యాంకు అవసరాలకు ఉపయోగించుకోవాలనుకునే రాజకీయ నేతలు మాత్రమే.. ప్రతి ఎన్నికల్లో కొత్తగా తాత్కాలిక తాయిలాల పథకాల్ని కనిపెడుతూ వాటిని హామీలుగా గుమ్మరించటం! ఇలా తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగ భృతిని తీసుకొస్తున్నారు.

రైతుబంధుతోపాటు నిరుద్యోగభృతి ఏకకాలంలో సాధ్యం కాదని చెబుతున్నారే తప్ప.. భృతి పథకాన్ని తెలంగాణలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కూడా నిర్ద్వంద్వంగా వ్యతిరేకించటం లేదు. అలాగే ఏపీలో ప్రతిపక్ష వైకాపా నేత వైఎస్ జగన్ కూడా.. నిరుద్యోగ భృతిని ఎన్నికల సంవత్సరం దాకా వాయిదా వేయటం ద్వారా ప్రతి ఇంటికీ చంద్రబాబు ఇన్ని వేల రూపాయలు బాకీ ఉన్నారని రెచ్చగొడుతూ నిరుద్యోగభృతికి పరోక్ష ఆమోదం తెలుపుతున్నారు. పైగా, చంద్రబాబు 45 ఏళ్ల వరకు నిరుద్యోగ భృతి ఇస్తే, తాను 45 ఏళ్ల నుంచి పింఛను ఇస్తానంటున్నారు. దేశంలోని కొన్ని ఇతర రాష్ట్రాల్లోనూ నిరుద్యోగ భృతి కార్యక్రమాన్ని ఏదోకరూపంలో అమలు చేస్తున్నారు. గౌరవప్రదంగా బతకగలిగే ఉపాధిని కల్పించే చర్యల మీద దృష్టి పెట్టకుండా నిరుద్యోగ భృతిని పెద్దఎత్తున అమలుచేసే ప్రయత్నం.. నిస్సందేహంగా తెలుగు రాష్ట్రాలు, దేశంలోని కోట్లాది యువతను అవమానించటమే.

నెలకు వెయ్యో, రెండు వేలో నిరుద్యోగ భృతి ఇస్తూ వారికి నైపుణ్యాల శిక్షణనిస్తామని, ఉపాధి అవకాశాలను కల్పిస్తామని

### జన్మభూమి కమిటీల హవా- బ్యాంకుల పెత్తనం- అనర్హులకూ లబ్ధి.. 10 శాతం కూడా కన్పించని స్వయం ఉపాధి యూనిట్లు



ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు పలు సామాజిక వర్గాల కోసం ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి పథకాల అమలు తీరు అక్రమాల పర్వంగా తయారైంది. ఆయా కులాలకు చెందిన యువతను స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం రూపొందించిన కార్యక్రమం.. అమలులో లోపాల వల్ల దెబ్బతింటోంది. గత ఏడాది రూ.2,000 కోట్లు ఖర్చు చేయగా, ఈ ఏడాది మరో రూ.5,000 కోట్లు ఖర్చు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ లెక్కన.. స్థిరపడేందుకు ఈ రెండేళ్లలో 5 లక్షల మందికిపైగా యువతకు అవకాశాలు లభించాలి. అయితే ఆ పరిస్థితి లేదు. రాష్ట్రంలో ఏ మండలంలోనూ 10 శాతం కూడా యూనిట్లు ఏర్పాటు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఈ అక్రమాలను మీడియాలో వచ్చిన పలు కథనాలు కూడా ధృవీకరిస్తున్నాయి.

గత ఏడాది 2.5 లక్షల మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర్చామని అధికారిక లెక్కల్లో చెబుతుంటే, క్షేత్రస్థాయిలో 10 శాతం మందికి కూడా సద్వినియోగమైనట్టు కన్పించటం లేదు. యూనిట్లు లేకుండానే సబ్సిడీని పొంది, ఇతర ఖర్చులకు వినియోగించుకుంటున్న వారే ఎక్కువగా కనిపిస్తున్నారు.

**బోగస్ గ్రౌండింగ్**

రాష్ట్రంలో ఈ పథకం అమలవుతున్న అన్ని మండలాల్లోనూ ఎక్కువమంది స్వయం ఉపాధి యూనిట్లు లేకుండా బ్యాంకులు, మండల అధికారులతో కుమ్మక్కయి బోగస్ గ్రౌండింగ్ చేయించుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇతరుల యూనిట్లను

(తరువాయి 14వ పేజీలో...)

(13వ పేజీ తరువాయి...)

చూపించి అవి తాము ఏర్పాటు చేసుకున్నవిగా ఫోటోలు తీసుకుని రుణాలతోపాటు సబ్సిడీ పొందుతున్నారు. మరి కొందరు యూనిట్ ఏర్పాటు చేయకుండానే బ్యాంకు అధికారులతో కుమ్మక్కయి సబ్సిడీతో సరిపెట్టుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలతోపాటు పలువురు పేదలకు రుణం అందించేందుకు బ్యాంకులు ముందుకు రావటం లేదు. దీంతో చాలా మండలాల్లో బ్యాంకులు నమ్మినవారికే రుణాలు అందుతున్నాయి. కొన్ని చోట్ల బ్యాంకులకు నచ్చిన లబ్ధిదారులకే అధికారులు సబ్సిడీ మంజూరు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వాస్తవ లబ్ధిదారులు నష్టపోతున్నారు.

**రికవరీ పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్**

ప్రకాశం జిల్లాలోని కొన్ని మండలాల్లో లబ్ధిదారుల ఒత్తిడి మేరకు బ్యాంకులు సబ్సిడీ అందించినా.. రుణమొత్తాన్ని లబ్ధిదారుని పేరుతో బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నారు. రుణం చెల్లించకపోతే ఫిక్స్‌డ్ డిపాజిట్ నుంచి రికవరీ చేయాలనే ఉద్దేశంతో బ్యాంకులు వ్యవహరిస్తున్నాయని చెబుతున్నారు. మరోవైపు (రాజ్యాంగ విరుద్ధమైన) జన్మభూమి కమిటీల సిఫారసుతో స్థితిమంతులు కూడా యూనిట్లు లేకుండానే రుణాలు పొందుతున్నారు. పలు గ్రామాల్లో ఒక వర్గానికే రుణాలందుతున్నాయని ఆరోపణలున్నాయి. కొన్ని మండలాల్లో ఎంపిక కమిటీకి ఎంతోకొంత ముట్టచెబితేగానీ యూనిట్ మంజూరయ్యే పరిస్థితి లేదు.

**పర్యవేక్షణ లేని పథకం**

సంక్షేమశాఖ నోడల్ ఏజెన్సీగా ఎస్సీ, ఎస్టీ, కాపు, బ్రాహ్మణ, అత్యంత వెనుకబడిన వర్గాలు, బీసీ, మైనారిటీలు, క్రిస్టియన్ మైనారిటీ, వికలాంగులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈబీసీ)తోపాటు ఈ ఏడాది వైశ్యులకు కూడా రుణాలు అందిస్తున్నారు. దీంతోపాటు రజక, నాయీబ్రాహ్మణ, వడ్డెర, సగర (ఉప్పర), కృష్ణబలిజ, పూసల, వాల్మీకి/బోయ, భట్రాజు, కుమ్మరి/శాలివాహన ఫెడరేషన్లు, విశ్వబ్రాహ్మణ, మేదర, కల్లుగీత కార్మికుల ఆర్థిక సహకార సంఘాల ద్వారా గ్రూపులకు, వ్యక్తిగతంగాను రుణాలందిస్తున్నారు. ఏటా వేల కోట్ల ఖర్చు పెడుతున్నా.. ఈ యూనిట్ల నిర్వహణ తీరుపై మానిటరింగ్ లేకపోవటంతో పథకం గాడి తప్పే అవకాశాలు ఏర్పడ్డాయి. మండల స్థాయిలో ఎంపిక కోసం ఇంటర్వ్యూలు నిర్వహించటం, ఆ తర్వాత గ్రౌండింగ్ వరకు మాత్రమే అధికారులు ఈ యూనిట్ల గురించి పట్టించుకుంటున్నారు. ఆ తర్వాత ఈ యూనిట్లు ఏమయ్యాయో పట్టించుకునేవారు లేరు. ఇప్పటివరకూ స్థాపించిన యూనిట్లను తనిఖీ చేసి అవి ఉన్నాయా, లేవా? అని తేల్చిన అధికారులు లేరు. గతంలో యూనిట్ పెడితేనే రుణాలు అనే భావనతో పెద్దగా ఈ రుణాలకు పోటీ ఉండేది కాదు. ఇప్పుడు యూనిట్లు ఏర్పాటు చేసినా, చేయకపోయినా సబ్సిడీ పొందే అవకాశం ఉండటంతో ఈ యూనిట్ల కోసం అనర్హులు కూడా ఎగబడుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెబుతోంది. నాలుగేళ్లుగా ఉపాధిని కల్పించలేనివారు రాబోయే కొద్దికాలంలో ఏదో అద్భుతం సృష్టిస్తారని మెడ మీద తలకాయ ఉన్నవారెవరూ భ్రమ పడరు. జాబ్ పోర్టల్ వంటి వాటి ఏర్పాటు కోసం నిరుద్యోగ భృతి పథకం దాకా వేచి చూడాల్సిన పనిలేదు. కులాల పేరుతో వివిధ కార్పొరేషన్ల ద్వారా ఇస్తున్న రాయితీ రుణాల్ని సక్రమంగా ఇవ్వటంతో పాటు కేంద్రం నుంచి ముద్ర రుణాల్ని ఎక్కువ సంఖ్యలో (విధివిధానాల్ని మార్చయినా సరే) ఇప్పించటంపై శ్రద్ధ పెట్టి ఉంటే రాష్ట్రంలో ఉపాధి కల్పన కొంతయినా గాడిన పడి ఉండేది. ఉన్న పథకాలను సద్వినియోగం చేయటం, నాణ్యమైన విద్యను అందించటం, ఉపాధిని బట్టే రాయితీలిచ్చే పారిశ్రామిక విధానాన్ని అమలు చేయటం, ఏదో ఒక రూపంలో హోదా పన్ను రాయితీల్ని పొందటానికి కొత్త ఆలోచనలు చేయటం మీద కాకుండా నిరుద్యోగ భృతి చుట్టూ రాజకీయాన్ని తిప్పటం వల్ల యువతకు ఏం ఒరుగుతుంది?

తమకు ఓటు వేయటానికి ఎన్నికల సమయంలో ఇచ్చే నోట్లు, ఇతర ప్రలోభాలు కాకుండా.. ఎన్నికల మధ్య కాలంలో వివిధ తాయిలాల్ని, భృతుల్ని కనీసం మొత్తంతో ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇలా ఏడాదికి కనీసం రూ. 50,000 ఏదోకరూపంలో అందరికీ లబ్ధి చేకూర్చటం లక్ష్యంగా పెట్టుకుంది. పొరుగు రాష్ట్రంది కూడా ఇదే తరహాగానీ, హైదరాబాద్ వల్ల మిగులు ఆదాయం ఉంది కాబట్టి కొంత అంకెలు పెరుగుతాయి. ఇదంతా ప్రజల పన్నులు, వనరుల సొమ్మేనన్న స్పృహ కూడా కలగనీయకుండా.. తమ సొంత సొమ్మున్నట్టు, తాము చేతికి ఎముక లేని దాతలమన్నట్టు ప్రచారం చేసుకుంటూ ఎన్నికల్లో లబ్ధి పొందాలని పాలకులు ప్రయత్నిస్తున్నారు.

ఈ తాయిలాల రాజకీయంలో ఈ పార్టీ, ఆ పార్టీ అని తేడా కూడా లేదు. ఇప్పుడు ఇదే నమూనాలో నిరుద్యోగ భృతిని ఇచ్చినప్పుడు, ఉపాధి అవకాశాలను కనుచూపు మేరలో

కల్పించలేనప్పుడు.. ఉప్పల రవి చేసిన పని అర్థరహితమని పూర్తిగా ఎలా కొట్టిపారేయగలం?

**జైలు బయట మనకున్న స్వేచ్ఛ ఎంత?**

రాజకీయ పార్టీల మీద కన్నా సైన్యం మీదే తమకు విశ్వాసం ఉందని మనదేశంలో 77 శాతం మంది అభిప్రాయపడినట్టు ఇటీవల ఒక సర్వే తెలిపింది. సైన్యాన్ని, నియంతృత్వాన్ని నమ్మటానికి మనలో పలువురు ఏదోకమేర ఎలాగూ సిద్ధంగా ఉన్నారు కాబట్టి.. కొంత స్వేచ్ఛను కూడా వదులు కుందామనుకుంటే నిరుద్యోగ భృతి కంటే జైలు జీవితం మెరుగేమోనన్న ఆలోచనను పరిగణలోకి తీసుకోవటానికి సంకోచించనక్కర్లేదేమో! అద్దె చెల్లించి మరీ జైలు జీవితాన్ని గడపటాన్ని ఓ సరదాగా భావిస్తున్న కాలం కూడా కాబట్టి.. నేరస్వభావంతో నేరాలు చేయకుండా కేవలం బతకటానికి జైలు కెళ్లటాన్ని మరీ అంత తప్పుపట్టలేమేమో!! కాస్త అతిగా, కటువుగా అనిపించొచ్చు గానీ.. ఈ ఆలోచన చేయక తప్పని విపత్కర పరిస్థితులు ఉన్నకొద్దీ పెరుగుతున్నాయి.

'నిరుద్యోగ భృతి/45 ఏళ్ల తర్వాత పింఛన్-అందుబాటులో స్మార్ట్‌ఫోన్-మద్యం బాటిల్' ఫార్ములా యువతరాన్ని నిర్వీర్యం చేయటానికి, సమాజంలో వికృత ఆలోచనా ధోరణుల్ని పెంచటానికి పొంచి ఉంది.

జైల్లో కంటే బయట మనం ఎంత స్వేచ్ఛగా ఉన్నామో కూడా కొంత తర్కించుకోవాలిక్కడ.

మనకేదో గొప్ప స్వేచ్ఛ ఉందనుకుంటున్నాం, ప్రభుత్వాలు కూడా పైకి మనకు స్వేచ్ఛనిస్తున్నట్టు కనిపిస్తున్నాయిగానీ.. నిజంగా మనకు అంత స్వేచ్ఛ ఉందా?

"నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిరహిత సేవలు, అందరికీ సమానంగా వర్తించే చట్టం, ఆంక్షలు లేకుండా మార్కెట్‌లో ఆర్థికావకాశాల్ని పొందటం వంటి ఏర్పాట్ల ద్వారా" నచ్చిన పనితో ఉపాధిని పొందుతూ స్వేచ్ఛగా ఎదిగే, సుఖసంతోషాలతో జీవించే పరిస్థితులు మనకున్నాయా?.. మనలో చాలామందికి స్వేచ్ఛ కేవలం అరవటానికి, ముక్కుమూసుకుని ఓటు వేయటానికే తప్ప.. నిజంగా ఎదగటానికి పనికొచ్చే స్థాయిలో లేదు.

జైలు అనే పేరు లేదుగానీ, ఒకరకంగా జైలులాంటి వాతావరణాన్నే సమాజంలో నిర్మించి, ఎదిగే అవకాశాలు లేకుండా మనలో అత్యధికులను ఆ చట్రంలో బందీలుగా కొనసాగించే రాజకీయమే ఇప్పుడు సాగుతోంది. దీన్ని యువత ప్రశ్నించాలి.

తాయిలాలకు బదులు అవకాశాల్ని,
పేదరికానికి బదులు సుస్థిరాభివృద్ధిని,
రచ్చకు బదులు చర్చను,
ఉద్రేకాలకు బదులు ఆలోచనల్ని,
అరాచకానికి బదులు సరైన వ్యవస్థల్ని.. మనం ఎంచుకున్నప్పుడే ఈ పరిస్థితులకు తెరదించి నిజమైన ఉపాధిని, ఎదుగుదలని ఇచ్చే స్వేచ్ఛను సాధించుకోగలం. ✳

# దశాబ్దాలు రాజకీయంలో, ఉద్యమాల్లో ఉన్నా.. విలువలపై ఎన్నడూ తొణకని విద్య: జేపీ

దశాబ్దాలపాటు ప్రధాన స్రవంతి రాజకీయాల్లోనూ, పలు రకాల ఉద్యమాల్లోనూ ఏకకాలంలో క్రియాశీలంగా పాల్గొన్నా.. ఎక్కడా తొణక్కుండా విలువల్ని, ఔన్నత్యాన్నీ పోషించుకున్న గొప్ప వ్యక్తి చెన్నుపాటి విద్య అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నివాళులర్పించారు.

"ఓ పక్క రాజకీయంలో ఉంటూనే పౌర సమాజ ఉద్యమాల్లో, మహిళలు, దళితులు, హేతువాదులు, గాంధేయవాదుల కార్యక్రమాల్లో విద్య చురుగ్గా పాల్గనేవారు. ఇలా పెద్దఎత్తున రాజకీయ ఉద్యమ కార్యక్రమాల్లో మమేకమైనా, పలు సవాళ్లను ఎదుర్కొన్నా.. మౌలిక విలువల్ని, ప్రమాణాల్ని జీవనపర్యంతం ఆచరణలో చూపారు. పదవి లేకున్నా తొణకని ఆత్మవిశ్వాసాన్ని, సమాజానికి మంచి జరగాలనే తపనను పుణికిపుచ్చుకున్న మహోన్నత మహిళ ఆమె" అని జేపీ ప్రస్తుతించారు. లోక్‌సత్తా ఉద్యమాల్లో దీర్ఘకాలం వివిధ రూపాల్లో విద్య కలిసి పనిచేశారని గుర్తుచేసుకున్నారు. ఆమె మృతి సమాజానికి పెద్దలోటని, ఈవేళ రాజకీయానికి, ప్రజాజీవితానికి ఇలాంటి వాళ్లు ఆదర్శమన్నారు. చెన్నుపాటి విద్య రాజకీయం, దీర్ఘకాల దృక్పథం, సమాజం పట్ల లోతైన అవగాహన నేటి రాజకీయ నేతలకు, ప్రజాజీవితంలో ఉన్న వారందరికీ స్ఫూర్తిదాయకమని జేపీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# డిగ్రీ, పీజీ చేసినవారు స్వీపర్ కావాలని ఎందుకనుకుంటున్నారు?

ప్రజలకు ఉపాధి అవకాశాలను కల్పించే పాలనను అందించే క్రమంలో ప్రభుత్వంలో కొన్ని ఉద్యోగాలు ఉంటాయి తప్ప, ఉద్యోగాలను ఇవ్వటం ప్రభుత్వం పనికాదు. కానీ మనదేశంలో ప్రభుత్వోద్యోగాల మీదే ఉన్నకొద్దీ ఆకర్షణ పెరుగు తోంది. అతి కొద్ది సంఖ్యలో ఉన్న ప్రభుత్వో ద్యోగాలకు లక్షల్లో దరఖాస్తులు చేసుకోవటం సాధారణ దృశ్యమైపోయింది. కొత్త నోటిఫికేషన్లు పాత రికార్డుల్ని అలవోకగా బద్దలు కొడుతున్నాయి.

■ రోడ్లు ఊడ్చేందుకు, మురుగు కాలువల్ని శుభ్రం చేసేందుకు 20,000మందిని రిక్రూట్ చేసుకోవాలని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించి ప్రకటన ఇచ్చింది. 20లక్షల దరఖాస్తులు వచ్చాయి.

■ ఆంధ్రప్రదేశ్‌లో గతేడాది 1055 పంచాయతీ సెక్రటరీ పోస్టులకు నిర్వహించిన తొలి దశ స్క్రీనింగ్ టెస్టుకి హాజరైన వారి సంఖ్య 3,67,341.

■ తెలంగాణలో వీఆర్వో, గ్రూప్-4 పోస్టులకు దాదాపు 10 లక్షల చొప్పున దరఖాస్తులు వచ్చినట్టు మీడియాలో వార్తలు వచ్చాయి. అంటే ఒక్కో పోస్టుకి పోటీ వందలు, వేలల్లోనే.

■ ఈమధ్య రైల్వే శాఖ అసిస్టెంట్ లోకోపైలెట్ (ఏఎల్‌పీ), గ్రూప్-డి పోస్టులకు ప్రకటనలు విడుదల చేసింది. ఇందులో ఏఎల్‌పీ, టెక్నీషియన్ పోస్టులు 26,502. గ్రూప్-డి పోస్టుల సంఖ్య 62,907. మొత్తం 90 వేలు కూడా లేని ఈ పోస్టులకు అక్షరాల రెండు కోట్ల ఇరవై ఏడు లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు.

■ దాదాపు 100 వరకు ఉండే ఐఏఎస్ పోస్టుల కోసం ఏటా 5 లక్షల మంది అప్లయ్ చేస్తున్నారు.

■ తెలుగు రాష్ట్రాల నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవటం కూడా ఇటీవలి కాలంలో పెరిగింది. సాఫ్ట్‌వేర్, ఇతర ఎక్కువ ఆదాయ సేవా విభాగాల్లో అవకాశాలు తగ్గిపోవటంతో.. ఇంజినీరింగ్ తదితర వృత్తి నైపుణ్య కోర్సుల్ని చదివినవారు కూడా కేంద్ర ఉద్యోగాల వైపు చూస్తున్నారు. దీంతో గతానికి భిన్నంగా కేంద్ర సంస్థల ఉద్యోగాల్లో తెలుగువారి వాటా ముందుముందు పెరిగే అవకాశముందని భావిస్తున్నారు.




**యువత ఉద్యోగ సృష్టికర్తలు కాగలగాలి**

భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు వల్ల ఉద్యోగాలు తగ్గనున్న నేపథ్యంలో చదువుకుంటున్న యువత ఉద్యోగాలు సృష్టించగలిగేవారిగా తయారుకావాలని బంగ్లాదేశ్ గ్రామీణ బ్యాంకు వ్యవస్థాపకుడు, నోబెల్ పురస్కార గ్రహీత మహ్మద్ యూనస్ అన్నారు. విద్యార్థులు చదువును ఉద్యోగాల కోసమనే విధానంలో కాకుండా వాటిని సృష్టించాలనే పట్టుదలతో కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన భారత ఆర్థిక సంఘ శతవార్షిక సదస్సులో మాట్లాడుతూ సూచించారు.

■ పదవ తరగతి, ఐటీఐ, డిప్లొమో క్వాలిఫికేషన్ సరిపోయే పోస్టులకు.. బీటెక్, ఎంటెక్, ఎంబీయే, పీహెచ్‌డీ చదివిన వారు కూడా దరఖాస్తు చేస్తున్నారు.

■ 2017లో రాజస్తాన్‌లో 18 ప్యూన్ ఉద్యోగాల కోసం 299 మంది పీహెచ్‌డీ చేసినవారు అప్లికేషన్ పెట్టుకున్నారు.

ప్రభుత్వోద్యోగం కోసం ఇచ్చే ప్రతి నోటిఫికేషన్‌లో ఇలాంటి ఉన్నత విద్యార్హతలు గలవారు 30 శాతానికిపైగా ఉంటున్నారని ఓ అంచనా.

మొదట పేర్కొన్న ఉత్తర ప్రదేశ్ రిక్రూట్‌మెంట్‌పై అంజులి భార్గవ రాసిన వార్తావిశ్లేషణనే చూద్దాం.

రోడ్లు ఊడ్చేందుకు, మురుగు కాలువల్ని శుభ్రం చేసేందుకు యూపీ ప్రభుత్వం జారీ చేసిన ఈ నోటిఫికేషన్‌కు దరఖాస్తుదారుల్లో ఎంబీయేలు, ఎంకాంలు, ఎంఎస్సీలు ఉన్నారు. ఇలా చాలామంది అవసరానికి మించి

భారీ క్వాలిఫికేషన్ ఉన్నవారే. యూపీ నుంచే కాకుండా ముంబయి, ఢిల్లీ, కోల్‌కతా నుంచి కూడా అప్లయ్ చేసినవారు కూడా పెద్దసంఖ్యలోనే ఉన్నారు.

ఇక ఈ ఉద్యోగాలకు యూపీ ప్రభుత్వం పరీక్షలు నిర్వహించిన తీరు మరింత విచిత్రంగా ఉంది.

ప్రాక్టికల్ పరీక్షల పేరుతో తమ ముందు చీపురుతో ఊడ్చి చూపించాలని అధికారులు అడుగుతున్నారని, కెమెరాలో రికార్డు చేస్తున్నారని అంజులి తెలిపారు. కెమెరా ముందు బ్రహ్మాండంగా ఊడ్చిన నిరుద్యోగులు.. ప్రభుత్వోద్యోగులయ్యాక అదే రీతిలో పనిచేస్తారా? అన్న సందేహం కూడా లేకుండా పరీక్షల్ని నిర్వహించారట. చాలా ప్రభుత్వోద్యోగాల్లోకి ఆదర్శభావాలతో ప్రవేశించినవారిలో పలువురు తర్వాతికాలంలో సోమరులుగా, లంచగొండులుగా మారటం మనదేశంలో ఆనవాయితీ. ముఖ్యంగా మునిసిపల్ పారిశుద్ధ్య విభాగంలో పనితీరు ఎంత అధ్వాన్నంగా ఉంటుందో దేశవ్యాప్తంగా బోలెడు ఉదాహరణలు కనిపిస్తాయి.

తల్లిదండ్రులు గతంలో పారిశుద్ధ్య కార్మికులుగా ఉన్న అభ్యర్థులకు అదనపు మార్కులు వేయాలని కూడా అధికారులు నిర్ణయించారట. అంటే.. మీ నాన్నో, అమ్మో స్వీపర్ అయివుంటే, మీరు బాగా రోడ్లు ఊడవగలరని అధికారుల అభిప్రాయమన్నమాట.

తర్వాత 'యాప్టిట్యూడ్' పరీక్ష చేశారు.

ఇదంతా జరిగాక.. ప్రభుత్వోద్యోగం అనే సెక్యూరిటీ కోసం కాకుండా నిజంగా స్వీపర్ కావాలని ఎంతమందికి ఉంది? అని చూస్తే, పాతకాలపు ఆలోచనాతీరే ఈతరంవారిలోనూ కనిపించిందని అంజులి వివరించారు. ప్రభుత్వోద్యోగాల పట్ల భారతదేశంలో పాతుకుపోయిన అర్థరహిత అభిప్రాయాలు, అవి యువతకు వ్యాపిస్తున్న వైనం మరీ ఇంత దారుణమా అనిపించకమానవు.

'మా నాన్న నా చదువు మీద రూ.5లక్షలు ఖర్చు పెట్టారు. ప్రస్తుతం నేను నెలకు రూ.8,000 జీతంతో ఓ చార్టర్డ్ అకౌంటెంట్ వద్ద పనిచేస్తున్నాను. స్వీపర్ ఉద్యోగమైనా సరే నెలకు రూ.17,000 జీతంతో ప్రభుత్వోద్యోగం వస్తే బ్రహ్మాండం' అని ఢిల్లీలో ఉంటున్న ఓ యువకుడు ఎంతో ఎగ్జయిట్ అయిపోతూ చెప్పాడు. ఎంకామ్ చేసిన అతను లక్నోలోని గౌతమబుద్ధ యూనివర్సిటీలో ఎంబీయే కూడా చేశాడు. ప్రభుత్వోద్యోగం కోసం అవసరమైతే టాయిలెట్లు కూడా శుభ్రం చేస్తానన్నాడు.

ఇక ఇటాకు చెందిన 66 ఏళ్ల హరికుమార్.. తన



కొడుకును నగరంలో చదివించటానికి కూతురుకు స్వీపర్ ఉద్యోగం రావాలని కోరుకున్నారు. కొడుకు పట్ల తన పక్షపాతాన్ని ఆయనేమీ దాచుకోలేదు. కూతురు రవీనా కూడా ఆడపిల్లలు అలా చేయటంలో తప్పేమీ లేదని తండ్రినే సమర్థిస్తోంది.

గోరఖ్‌పూర్‌లో బీఈడీ చేసి అలహాబాద్‌లో ఉపాధ్యాయ అర్హత పరీక్షలో పాసైన 27 ఏళ్ల శ్యాం సుందర్ కూడా స్వీపర్‌గా ప్రభుత్వ కొలువులో చేరి పెళ్లిళ్ల మార్కెట్‌లో తన డిమాండ్‌ను పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

చివరిగా, మెరిట్ ప్రకారం కాకుండా వేరే రకంగా ప్రభుత్వంలో ఉద్యోగం ఇస్తారా? అనే సందేహం అభ్యర్థులను వేధించింది.

'ధర రూ.2లక్షలు, 3 లక్షలు, చాలామంది అభ్యర్థులు చెల్లించలేని స్థాయిలోనే ఉండవచ్చు' అని అంజులి వ్యాఖ్యానించారు.

... భారతదేశంలో ప్రభుత్వోద్యోగాల పట్ల ఉన్న వేలంవెర్రి ఆకర్షణను, నేపథ్యాన్ని అంజులి స్థూలంగా కళ్లకు కట్టారు.

ఇంకొంచెం లోతుగా ఆలోచిస్తే.. ఇందులో ప్రభుత్వాల విధానపర వైఫల్యం ఎంత పెద్దఎత్తున ఉందో కనిపిస్తుంది.

ప్రపంచంలో ఎక్కడైనా తలెత్తుకుని ధీమాగా బతకగలమనే తరహా నాణ్యమైన చదువును ప్రతి బిడ్డకూ అందించటంలో మన ప్రభుత్వాలు స్వతంత్రం వచ్చిన నాటి నుంచీ విఫలమవటం మన యువత పాలిట శాపంగా మారింది. కమ్యూనిస్టులు, చివరకు నక్సలైట్లు కూడా మనదేశంలో విద్య, ఆరోగ్యం ప్రాధాన్యతను గుర్తించటంలో విఫలమయ్యారు. పర్యవసానంగా, నైపుణ్యాలు

లేకుండా ప్రాపకం మీద, సిఫార్సుల మీద, కులం వంటి వాటి మీద ఆధారపడి ఉపాధిని పొందే ధోరణి మనలో ప్రబలిపోయింది. ఇదే సమయంలో ప్రభుత్వోద్యోగ వ్యవస్థను సేవకు మారుపేరుగా చేయకుండా.. వారి బదులు రాజకీయ కార్యకర్తలను దళారీలుగా ప్రోత్సహించే సంస్కృతిని కాంగ్రెస్ పార్టీ ప్రారంభించి కొనసాగించింది. బీజేపీ, ప్రాంతీయ పార్టీలు అని తేడా లేకుండా అన్ని పార్టీలూ దీన్ని ఇప్పటికీ కొనసాగిస్తున్నాయి. ఈవేళ రాజకీయ కార్యకర్తలతో, లంచాలతో ప్రమేయం లేకుండా ప్రజాసేవకుల్లా పనిచేస్తున్న ప్రభుత్వోద్యోగుల సంఖ్య చాలా తక్కువ. దీంతో ఎన్నికల వ్యవస్థ భ్రష్టుపట్టటమే కాకుండా.. ప్రభుత్వోద్యోగులు బ్రిటీష్ హయాంలోలా, నల్లదొరల్లా జనంపై పెత్తనం చేసే వర్గంగా తయారయ్యారు. ప్రపంచంలో మరే దేశంలోనూ లేనిరీతిలో మనదేశంలో.. ఓ సాధారణ ప్యూను స్థాయి ప్రభుత్వోద్యోగి 90 శాతం ప్రజల కంటే శక్తిమంతుడిగా తయారయ్యాడు. 'ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా తనకు అందాల్సిన సేవకు గతిలేక లంచం ఇచ్చే పౌరునికి 3 ఏళ్లు కనీసం, 7 ఏళ్లు గరిష్ఠంగా శిక్ష.. లంచం తీసుకున్న అధికారిని విచారించటానికి మాత్రం పై నుంచి అనుమతి' అనే సవరణను అవినీతి నిరోధక చట్టానికి చేశారంటే.. ప్రభుత్వాలను, పార్టీలను ఉద్యోగులు సంఘటిత శక్తిగా ఎంతగా వణికిస్తున్నారో, రాజకీయ అవినీతి ఎంతగా వేళ్లూనుకపోయిందో గ్రహించవచ్చు.

సాధారణ పౌరునికంటే చాలా ఎక్కువ మొత్తంలో జీతం, అదనంగా గీతం (లంచం) పొందే వెసులుబాటు, ఎన్ని తప్పులు చేసినా ఉద్యోగాన్నుంచి తొలగించటం సులభసాధ్యం కాకపోవటం, ప్రైవేటు రంగంతో పోలిస్తే పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేకపోవటం, వైద్యం తదితర సేవల్లో ప్రత్యేక రాయితీలు, రిటైరయ్యాక పింఛను, భార్యకు కూడా పింఛను వర్తింపు, ప్రైవేటు రంగంలోలా అదనపు సామర్థ్యాల్ని నిరంతరం పెంచుకోవాల్సిన అవసరం లేకపోవటం, సాంప్రదాయంగా వస్తున్న భావజాలం తదితర కారణాల వల్ల యువత ప్రభుత్వోద్యోగాల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. లక్షల రూపాయల ప్యాకేజీల్ని కూడా వదులుకుని సివిల్ సర్వీసెస్ వంటి వాటివైపుకి వచ్చేవారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఈ నేపథ్యమే దేశ భవిష్యత్తుకి వనరుల కొరతను సృష్టిస్తూ నిరుద్యోగ భృతి వంటి మోసపూరిత కార్యక్రమాలకు అవకాశమిస్తోంది.

రాబోయేకాలంలో ప్రభుత్వం ఇచ్చే పింఛన్లు, ఉద్యోగుల జీతాలను మించిపోనున్నాయి. ఈ నేపథ్యాన్ని కాస్త కూడా పరిగణలోకి తీసుకుని పరిష్కారాలు వెతక్కుండా సీపీఎస్ వంటి విధానాలను రద్దు చేయటానికి రాజకీయ పార్టీలు అత్యుత్సాహంతో మద్దతు ప్రకటిస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయాన్ని మిగతా ప్రజలకంటే అనేకరెట్లు ఎక్కువగా తాము పొందుతుంటే.. తమ కుటుంబాల్లోని బిడ్డలకే ముమ్మందు ఉమ్మడి అవకాశాలు కరువవుతాయనే స్పృహను ఉద్యోగుల్లో పెంచి వారిని ఆలోచింప చేసే ప్రయత్నం చేయకుండా, కేవలం ఉద్యోగుల ఓట్ల కోసం ప్రధాన రాజకీయ పార్టీలు పోటీ పడుతున్నాయి. ప్రత్యామ్నాయ విధానాలంటూ తెలుగునాట ప్రచారం చేసుకుంటున్న జనసేన పార్టీ కూడా ఇదే తీరుగా మాట్లాడుతోంది.

ప్రభుత్వం చేయాల్సిన పనుల్ని సరిగా చేసి ఉంటే నిరుద్యోగ భృతి వంటి చిట్కాలెందుకు?

ప్రభుత్వం తాను చేయాల్సిన పనుల్లో భాగంగా నాణ్యమైన విద్య, ఆరోగ్యాల్ని అందరికీ అందించినట్టయితే, చట్టబద్ధ పాలనను, మౌలిక వసతుల్ని కల్పించినట్టయితే, గుత్తాధిపత్యాలు లేని స్వేచ్ఛా మార్కెట్‌ను ప్రోత్సహించినట్టయితే, వ్యవసాయాన్ని లాభసాటి చేసినట్టయితే, ప్రభుత్వోద్యోగులను నిజమైన ప్రజాసేవకులుగా రూపొందించేలా 'పౌర సేవల' చట్టం వంటి వాటిని తేవటంతోపాటు వారి జీతభత్యాలు సామాన్య ప్రజలకంటే మరీ ఎక్కువ కాకుండా చేసినట్టయితే.. ప్రభుత్వోద్యోగాల గురించి ఎగబడుతూ యువత కాలహరణం చేస్తుండేవారు కాదు. నగరాలకు, పట్టణాలకు వలసలు పోయేవారు కాదు. వారి చుట్టూనే ఉపాధి అవకాశాలు పెరిగేవి, వాటిని అందుకోగలిగే నైపుణ్యం కూడా వారికి ఉండేది. స్వయంఉపాధి పొందేవారి, మరింత నైపుణ్యాల్ని పెంచుకుంటూ నూతన అవకాశాల్ని సృష్టించేవారి సంఖ్య గణనీయంగా ఉండేది. ప్రభుత్వాలు ఇలా తమ బాధ్యతల్ని చేయకుండా పరిమితమైన ప్రభుత్వోద్యోగాల్ని గుప్పెట్లో చూపుతూ, ఉపాధి సృష్టిలో తమ వైఫల్యాల్ని దాటవేస్తున్నాయి. మరీ పీకల మీదకి వస్తుందనుకున్నప్పుడు.. నిరుద్యోగ భృతి వంటి చిట్కాలతో కొత్తరకంగా మభ్యపెడుతున్నాయి.

వాస్తవానికి ప్రభుత్వోద్యోగమంటే రాజకీయంలాగే గొడ్డుచాకిరీతో చేసే సేవ! అందుకే ప్రజాప్రతినిధుల్ని, ప్రభుత్వోద్యోగుల్ని ప్రజాసేవకులుగా నిర్వచిస్తారు. ఆసక్తి, అవకాశం ఉన్నవారు ప్రభుత్వోద్యోగం కోసం ప్రయత్నించటం, వస్తే చేయటం తప్పు కాదు. కానీ దాన్నో సేవగా కాకుండా, జాక్‌పాట్‌గా, లైఫ్ టైమ్ ఎఛీవ్‌మెంట్‌గా భావించటం మాత్రం మనల్ని మనం మోసం చేసుకోవటం, సమాజాన్ని మోసం చేయటం, చివరికి అందరూ నష్టపోవటం అవుతుంది. నిరుద్యోగ భృతి ఉచ్చులోనే కాకుండా ప్రభుత్వోద్యోగం మీద మితిమీరిన మోజులో పడకుండా.. యువత ధైర్యంగా నిలబడి సమాజానికి ఉపయోగపడే పని ద్వారా ఉపాధిని పొందటం, ఆ దిశగా ప్రభుత్వాల విధానాలను మార్చటానికి అవగాహనతో పోరాడటం ఈవేళ్టి అవసరం.

✳

# పరిష్కారం.. ప్రభుత్వోద్యోగుల వేతనాలు తగ్గించటమే!

**- భరత్ ఝున్‌ఝున్‌వాలా**

**ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలలో ప్రభుత్వోద్యోగుల వేతనాలు సామాన్య ప్రజల సగటు ఆదాయాల కంటే కేవలం 1 నుంచి రెండు రెట్లు మాత్రమే అధికంగా ఉన్నాయి. అయితే ఇందుకు మనదేశం ఒక స్పష్టమైన మినహాయింపు. మన ప్రభుత్వోద్యోగుల ఆదాయం సామాన్య ప్రజల సగటు ఆదాయం కంటే 36 రెట్లు అధికంగా ఉన్నాయి. ప్రభుత్వోద్యోగులు అవినీతికి పాల్పడటం ద్వారా తమ వేతన భత్యాల కంటే నాలుగు రెట్లు అధికంగా ఆర్జిస్తున్నారని ప్రొఫెసర్ ఆర్.వైద్యనాథన్ (ఐఐఎం, బెంగళూరు) అంచనా వేశారు.**

**సౌఖ్యంగా జీవించడానికి అవసరమైన ఆదాయాల ప్రాతిపదికన ప్రభుత్వోద్యోగుల వేతన భత్యాలను వేతన సంఘాలు నిర్ణయిస్తాయి. అయితే దేశంలోని మిగతా 98శాతం మంది ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారా లేదా అనే అంశాన్ని వేతన సంఘాలు పట్టించుకోవటం లేదు. దీంతో మన సమాజంలో ఒక వింత పరిస్థితి నెలకొంది. మనదేశంలో రెండు కోట్ల మంది ప్రభుత్వోద్యోగులు ఉన్నారు. ప్రజలకు 'సేవ' చేయటానికే వారు నియమితులయ్యారు. అయితే ఏ ప్రజల 'సేవ' కోసమైతే నియమితులయ్యారో ఆ ప్రజల ఆదాయాలకంటే ప్రభుత్వోద్యోగులు 36రెట్లు అధికంగా ఆదాయాన్ని పొందుతున్నారు.**

విద్యా, ఉద్యోగరంగాలు, చట్టసభలలో రిజర్వేషన్లకై డిమాండ్లు వర్తమాన రాజకీయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్నాయి. మెరుగైన స్థితిగతులు కలిగివున్న పాటీదారులతో సహా వివిధ కులాలు రిజర్వేషన్లకై ఆరాటపడుతున్నాయి. ఆందోళన చేస్తున్నాయి. రిజర్వేషన్ల అంశం రాజకీయాలను ఎంతగా ప్రభావితం చేస్తోందీ గుజరాత్ ఎన్నికల్లో స్పష్టంగా చూశాం.

దళితులు (ఎస్సీ), గిరిజనులు (ఎస్టీ) తమకు చారిత్రకంగా జరిగిన అన్యాయాలను అధిగమించి అభ్యున్నతి సాధించడానికి గాను ప్రభుత్వోద్యోగాలలో వారికి రిజర్వేషన్లు కల్పించారు. ఆ అణగారిన వర్గాలవారికి ఈ సదుపాయం రాజ్యాంగ నిర్దేశం. మరెవరి భిక్షా కాదు. ఎస్సీ, ఎస్టీ విద్యావంతులు ప్రభుత్వ వ్యవస్థలో పదవుల రీత్యా, ఉద్యోగాల రీత్యా తమకు లభించిన పలుకుబడి, అధికారాలను సొంత సామాజికవర్గాలకు చెందిన వారి పురోగతికి వినియోగిస్తారని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. ఒక దళిత కానిస్టేబుల్, అగ్రవర్ణాల దాష్టీకానికి వ్యతిరేకంగా తమ సొంత సామాజిక సమూహాలకు చెందినవారికి



న్యాయం చేకూర్చగలరని రాజ్యాంగ నిర్మాతలు విశ్వసించారు. అయితే గత ఏడు దశాబ్దాలుగా మన అనుభవం చెబుతున్న వాస్తవమేమిటి? స్వతంత్ర భారతీయ సమాజంలో చోటుచేసుకున్న మార్పులు రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన దానికి పూర్తి విరుద్ధంగా ఉన్నాయనే కాదూ?! దళిత అధికారులు తమ దళిత సోదరీసోదరుల పట్ల మరింత నిరంకుశంగా వ్యవహరించటం కద్దని దళిత స్నేహితులు నాకు తరచు చెబుతుంటారు. అగ్రకులాల వారితో కుమ్మక్కయి తమ సొంత సామాజిక వర్గాలవారినే దోపిడీ చేస్తున్నారు.

జీవితంలో వ్యక్తిగత విజయానికి, ఉన్నతికి ప్రభుత్వోద్యోగం ఒక రాజమార్గంగా పరిగణింప బడుతోంది. దేశంలో ఎక్కడైనా సరే ఏదైనా ఒక మారుమూల గ్రామానికి వెళ్లండి. అక్కడ కనిపించే పది పక్కా గృహాల్లో తొమ్మిది కచ్చితంగా ప్రభుత్వోద్యోగులవే అయివుంటాయి. కారణం చెప్పాలా? మన ప్రజల సగటు ఆదాయం కంటే ప్రభుత్వోద్యోగుల వేతన భత్యాలు దాదాపు తొమ్మిదిరెట్లు అధికంగా ఉంటున్నాయి.

మనదేశంలో పది సంవత్సరాల క్రితం (2007–

08లో) ఒక ప్రైవేటు ఉద్యోగంలో సగటు వేతనం సంవత్సరానికి రూ. 46,802 అని న్యూఢిల్లీలోని 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్టడీస్ ఇన్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్' అంచనా వేసింది. కేంద్ర ఆర్థికమంత్రిత్వ శాఖ రూపొందించిన 'ఆర్థిక సర్వే' ప్రకారం 2007–08లో ప్రభుత్వ రంగ సంస్థల సిబ్బంది సగటు వార్షిక జీతం రూ. 410,898. కారణాలేమిటో తెలియవు గానీ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇటీవలి సంవత్సరాల 'ఆర్థిక సర్వే'లలో ఈ కీలక సమాచారం ఇవ్వడం లేదు. తత్కారణంగా నేను అంతకు ముందటి సంవత్సరపు సమాచారంపై ఆధారపడ్డాను. ప్రైవేటు రంగపు ఉద్యోగుల కంటే ప్రభుత్వోద్యోగులు తొమ్మిది రెట్లు అధికంగా వేతనం పొందుతున్నారు. ఇది కేవలం అధికారిక ఆదాయం మాత్రమే సుమా! ప్రభుత్వోద్యోగులు అవినీతికి పాల్పడటం ద్వారా తమ వేతన భత్యాల కంటే నాలుగు రెట్లు అధికంగా ఆర్జిస్తున్నారని ప్రొఫెసర్ ఆర్. వైద్యనాథన్ (ఐఐఎం, బెంగళూరు) అంచనా వేశారు. ఈ దృష్ట్యా ప్రభుత్వోద్యోగుల నిజ ఆదాయం సగటు పౌరుని ఆదాయం కంటే 36 రెట్లు అధికంగా ఉంటుంది. ప్రభుత్వం ప్రజల నుంచి పన్నుల రూపేణా భారీ రాబడిని పొందుతోంది. ఆ ఆదాయాన్ని ప్రభుత్వోద్యోగుల వేతన భత్యాలకు ఉపయోగించటమే కాకుండా, వారు మరింతగా ఆర్జించడానికి అనేక అవకాశాలను సమకూరుస్తోంది!

నేడు రిజర్వేషన్లను డిమాండ్ చేయని కులమేదైనా ఉన్నదా? దాదాపుగా లేదు. రిజర్వేషన్లు కావాలని గట్టిగా డిమాండ్ చేస్తున్న వారి ఆలోచనలు సంపదను సృష్టించటంపై కాకుండా ప్రజలను దోపిడీ చేయటంలో భాగస్వాములు కావడంపైనే కేంద్రీకృతమవుతున్నాయి. ఈ క్రమంలో దేశ రాజకీయాలు అభివృద్ధి–కేంద్రిత వ్యవహారాలు కాకుండా దోపిడీ–కేంద్రిత కార్యకలాపాలై పోయాయనడం సత్యదూరం కాదు.

పరిష్కారమేమిటి? ప్రభుత్వోద్యోగుల వేతనాలు తగ్గించడమే. ప్రపంచబ్యాంకు సమకూర్చిన సమాచారం ప్రకారం ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలలో ప్రభుత్వోద్యోగుల వేతనాలు సామాన్య ప్రజల సగటు ఆదాయాల కంటే కేవలం 1 నుంచి రెండు రెట్లు మాత్రమే అధికంగా ఉన్నాయి. అయితే ఇందుకు మనదేశం ఒక స్పష్టమైన మినహాయింపు. మన ప్రభుత్వోద్యోగుల ఆదాయం సామాన్య ప్రజల సగటు ఆదాయం కంటే 36 రెట్లు అధికంగా ఉన్నాయని ఇప్పటికే చెప్పుకున్నాము. సర్కారీ సిబ్బంది వేతనాలను తగ్గిస్తే ప్రభుత్వోద్యోగాల ఆకర్షణ తగ్గిపోతుంది. కొత్తగా రిజర్వేషన్ల డిమాండ్లు తగ్గుముఖం పడతాయి. అయితే అక్రమార్జనలకు అవకాశాలు యథాతథంగా ఉండిపోతాయి. వీటిని వేరే విధంగా నిర్మూలించవచ్చు. సంపద సృష్టి ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడటం కాకుండా ప్రజలను దోపిడీ చేయటంలో మరింత భాగస్వామ్యం సాధించుకోవడంపైనే వివిధ కులాలవారు తమ దృష్టిని కేంద్రీకరించారన్నది ఇక్కడ మనం పట్టించుకోవాల్సిన విషయం.

సౌఖ్యంగా జీవించడానికి అవసరమైన ఆదాయాల ప్రాతిపదికన ప్రభుత్వోద్యోగుల వేతన భత్యాలను వేతన సంఘాలు నిర్ణయిస్తాయి. అయితే దేశంలోని మిగతా 98శాతం మంది ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారా లేదా అనే అంశాన్ని వేతన సంఘాలు పట్టించుకోవటం లేదు. దీంతో మన సమాజంలో ఒక వింత పరిస్థితి నెలకొంది. మనదేశంలో రెండు కోట్ల మంది ప్రభుత్వోద్యోగులు ఉన్నారు. ప్రజలకు 'సేవ' చేయటానికే వారు నియమితులయ్యారు. అయితే ఏ ప్రజల 'సేవ' కోసమైతే నియమితులయ్యారో ఆ ప్రజల ఆదాయాలకంటే ప్రభుత్వోద్యోగులు 36రెట్లు అధికంగా ఆదాయాన్ని పొందుతున్నారు. ✳

# ఆయుష్మాన్ భారత్ వల్ల బీమా సంస్థలకు మేలు

సెప్టెంబర్ 25 నుంచి కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న బీమా ఆధారితక భారీ ఆరోగ్య పథకం 'ఆయుష్మాన్ భారత్' వల్ల ఇన్సూరెన్స్ కంపెనీలకు మేలు జరుగుతుందని, వాటికి అధిక ప్రీమియం వసూలవుతుందని మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ పేర్కొంది. 10 కోట్ల పేద కుటుంబాలకు ఆరోగ్య బీమా కల్పించాలన్నది ఈ పథకం లక్ష్యం కాగా, ఏడాదికి రూ. 5 లక్షల వరకు కవరేజీ లభిస్తుంది. సాధారణ బీమాలో 23 శాతం వరకు వాటా ఆరోగ్య బీమాదే కావటం గమనార్హం. ఆయుష్మాన్ భారత్ పథకం వల్ల మరో 50 కోట్ల మంది బీమా పరిధిలోకి వస్తారని నివేదిక అంచనా వేస్తోంది. ట్రస్ట్ పద్ధతి అమలు చేసే రాష్ట్రాల్లో ప్రభుత్వ నిధులు నేరుగా బీమా ప్రీమియంకు వెళ్లకుండా ట్రస్ట్ నిధికి వెళ్లి అక్కడ నుంచి క్లెయిమ్‌లకు చెల్లింపులు జరుగుతాయి.



# సమాజానికి ఉపయోగపడే పని చేయటమే సరైన ఉపాధి మార్గం

**ఉపన్యాసమా? చర్చ చేద్దామా?..**

**మీ ప్రిన్సిపల్ గారు ఉపన్యాసం బాగుంటుందంటున్నారు. మీరేమంటారు?**

**చర్చ చేద్దాం సార్.**

**వెరీగుడ్. నేను కోరుకుంటున్నదీ అదే.**

**.. ఇలా చిత్తూరు జిల్లా బి.కొత్తకోట సురాజ్య యాత్రలో సుంకు ఉషాగౌతమి కళాశాల విద్యార్థులతో చర్చను జేపీ ప్రారంభించారు.**

చర్చకు ప్రాతిపదికగా సురాజ్య ఎజెండాలోని కొన్ని విషయాలను విద్యార్థులకు జేపీ వివరించారు.

తర్వాత కొన్ని ప్రశ్నలతో చర్చను మొదలుపెట్టారు.

మీరంతా చదువు పూర్తయ్యాక మీరంతా మంచి ఆదాయాన్ని పొందుతూ సెటిలవ్వాలనుకుంటున్నారు గదా!

అవును! అవును!

అంటే సంపద సృష్టిలో భాగమవుతారన్నమాట.

ఇంతకీ సంపద సృష్టి అంటే ఏమిటి?

(పెద్ద సంతృప్తికర సమాధానం లేదు).

సంపద సృష్టి అంటే డబ్బుల్ని సృష్టించటం కాదు. సమాజానికి ఉపయోగపడే సేవలను సృష్టించటమే సంపద సృష్టి! ఆ సేవల్ని నాణ్యంగా, తక్కువ ధరకు మనం అందించగలిగితే మనకు ఉద్యోగాలివ్వటానికి ఎవరైనా ముందుకొస్తారు. మన వల్ల సమాజానికి ఉపయోగపడేవి ఉత్పత్తికాకపోతే, ఆటోమేటిక్‌గా మన ఉద్యోగావకాశాలు తగ్గిపోతాయి. మరి సంపదసృష్టి చేయడానికి మనకు ఏం కావాలి?

నైపుణ్యాలు!

నైపుణ్యాలు.. ఇవి ఎక్కడ్నుంచి వస్తాయి?

చదువు నుంచి.

మరి మన చదువులు ఎలా ఉన్నాయి?.. ఆ మధ్య 74 దేశాల మధ్య ఒక సర్వే చేశారు. 15 ఏళ్ల వయసు పిల్లల చదువు ఏ దేశంలో ఎలా ఉంది అన్నది తెలుసుకోవటమే ఆ సర్వే లక్ష్యం. ఆ సర్వేలో మనదేశం ఏ స్థానంలో ఉందో తెలుసా?

(కొద్దిసేపు క్రాస్‌టాక్ గొడవ)

ఎవరోకరు చెప్పండి. ఇదేమీ ఎగ్జాం కాదు. తప్పు చెప్పినా పర్లేదు. ఒకరు మైక్ పట్టుకుని చెబుతుంటే మిగతావారంతా వినాలి. అప్పుడే అది చర్చ అవుతుంది.

చివరిక ఓ అమ్మాయి చెప్పింది– 73వ స్థానం సార్.

అంత నిరాశ ఎందుకమ్మా, మనదేశం చదువులో అంత చిట్టచివరి స్థానంలో ఉండాల్సిందేనా? అని జేపీ వ్యాఖ్యానించటంతో ఇంకొందరు ముందుకొచ్చారు.

1వ స్థానం సార్, 63వ స్థానం సార్, 74వ స్థానం సార్ అని సమాధానాలు వినవచ్చాయి.

చివరకు ఓ అమ్మాయి లేచి, సార్, నేనెక్కడో చదివాను, 73వ స్థానం అని స్పష్టంగా చెప్పింది.

మరీ ఊహాగానం చేయకుండా కొంత అవగాహనతో ఆ అమ్మాయి చెప్పింది కరెక్ట్. మనదేశం 74 దేశాల్లో హైస్కూలు స్థాయి విద్యలో 73వ స్థానంలో ఉంది అని జేపీ ప్రకటించారు.

ఈ సర్వేను 'పీసా' సర్వే అంటారు. దేశంలో పీసా సర్వేను బాగా ప్రచారం చేసింది నేనే. దాదాపు సగంమందికి ఈ సర్వే గురించి తెలియటానికి పనిగట్టుకుని నేను చేసిన ప్రచారమే కారణం. ప్రభుత్వం కొంతయినా సిగ్గు తెచ్చుకుని చదువును ఎలా బాగుచేయాలో ఆలోచిస్తుందని ఈపని చేశాను. కానీ ప్రభుత్వం ఏం చేసిందో తెలుసా? నా తలతిరిగి పోయే పనిచేసింది? ఏం చేసిందను కుంటున్నారు అని జేపీ మళ్లీ ప్రశ్నించారు.

(పెద్దగా సమాధానం ఇవ్వలేకపోయారు).

పీసా సర్వే నుంచే వైదొలుగుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది అని జేపీ తెలిపారు.

చదువులో తామెక్కడున్నామో తెలుసుకోవటానికి ప్రపంచ దేశాలు.. గణితం కాన్సెప్టులు, విశ్లేషణ, తర్కం, తెలిసిన పరిజ్ఞానాన్ని అన్వయం చేయటం వంటి గీటురాళ్లతో పీసా సర్వే చేయిస్తున్నాయని, దాన్నుంచి వైదొలగడం ద్వారా మనదేశం విద్యార్థులకు తీవ్ర నష్టం చేకూర్చిందని అన్నారు.

పీసా కాకుండా దేశంలోపల కొన్ని సర్వేలు జరిగాయని, ఈ సర్వేల్లో పీసాలో అడిగిన స్థాయి ప్రశ్నలు కూడా లేవని, అందులో కూడా మన చదువులు అత్యంత అధ్వాన్నంగా ఉన్నాయని జేపీ అన్నారు. పీసాలో ఒక గుణకారం, భాగాహారం ఎందుకు చేయాలో కూడా ఆలోచించాల్సి ఉంటుందని, కానీ అవేవీలేకుండా ఒట్టి భాగాహారం, తీసివేత చేయమన్నా చేసే పరిస్థితి లేదని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 8వ తరగతిలో ఉన్న విద్యార్థుల్లో పలువురు ఒక సాధారణ పాఠ్యాంశాన్ని చదివే స్థాయిలో కూడా లేరన్నారు.

ఈ చదువులతో మనం సంపద సృష్టించగలమా? అని ప్రశ్నించారు.



### పెద్ద నోట్ల రద్దు వల్ల దేశ ప్రజలకు ఇబ్బందులు, ప్రధానికి లాభం

పెద్ద నోట్ల రద్దును అసమర్థంగా అమలుచేయటం వల్ల దేశంలో కోట్లాది సామాన్యులు ఇబ్బందులు పడ్డారని, ప్రధానికి మాత్రం ఎన్నికల్లో రాజకీయ లాభం జరిగిందని జేపీ ఓ ప్రశ్నకు సమాధానంగా అన్నారు. ఇంత జరిగినా, జనం ఇన్ని కష్టాలు పడ్డా.. అవినీతిని నిర్మూలించటానికి పౌర సేవల చట్టం, అవినీతికి పాల్పడ్డ ఉద్యోగుల తొలగింపు వంటి చర్యల్ని కూడా కేంద్రం చేపట్టలేదన్నారు. ప్రజల్లో విషయ పరిజ్ఞానం పెరగకపోతే పాలకుల ప్రచారమే రాజకీయంగా మారి దేశాన్ని నష్టపరుస్తుందన్నారు.

### ప్రశ్నించి పరిష్కారాన్ని రాబట్టిన విద్యార్థినులను సన్మానించిన జేపీ

పెద్ద నోట్ల రద్దుపై, రిజర్వేషన్లపై నిర్దిష్టమైన ప్రశ్నలడిగి జవాబులు రాబట్టిన లావణ్య, జయశ్రీ అనే విద్యార్థినులను జేపీ వేదికపైకి ఆహ్వానించి సత్కరించారు. రిజర్వేషన్లపై అడిగిన ప్రశ్నకు జేపీ జవాబిస్తూ, "తల్లిదండ్రులు చదువుకోకుండా ఉన్న ఓ గ్రామీణ బాలిక నూటికి 80 మార్కులు తెచ్చుకుంటే, తల్లిదండ్రులు బాగా చదువుకున్నవాళ్లయి, డబ్బు, పట్టణంలో మంచి శిక్షణ సదుపాయం ఉన్న ఓ కుర్రాడికి 82 మార్కులొస్తే.. వీరిద్దరిలో ఎవరు నిజంగా తెలివైనవారు" అని ప్రశ్నించారు. రిజర్వేషన్ లేకుండా మెరిట్ ప్రకారమే అయితే ఆ కుర్రాడికి, గ్రామీణ, పేదరిక, కుల వివక్షకు గురవుతున్నందున కొంత వెసులుబాటును కల్పిస్తే ఆ బాలికకు సీటు లేదా ఉద్యోగం రావాలని అన్నారు. ఆ బాలికే తెలివైనది, ఆ బాలికకే సీటు వచ్చేలా కొంత రిజర్వేషన్ వెసులుబాటు ఉండాలి అని విద్యార్థుల చేత ఒప్పించారు.

ఈ పరిస్థితిని చర్చించి పరిష్కారాలను కనుగొని మార్చేందుకే సురాజ్య యాత్ర అని జేపీ వివరించారు.

యువత తమ జీవితాల్ని చూసుకుంటూనే కొంత సమాజం గురించి పట్టించుకోకపోతే ఎంత నష్టం వస్తుందో విద్యారంగంలోని గణాంకాలే రుజువు చేస్తున్నాయని, ఇది ఓ మచ్చుతునక మాత్రమేనని జేపీ అన్నారు. ప్రభుత్వాలు మన పేరు మీద రోజుకు రూ. 11,000కోట్లు ఖర్చు చేస్తున్నాయని, అయినా సరైన చదువు, ఆరోగ్యం, ఉపాధి అందటం లేదని, ఏ ఆఫీసుకెళ్లినా లంచాలు అడుగుతారని, భద్రతకు గ్యారంటీ లేదని అన్నారు. ఈ డబ్బును సద్వినియోగం చేస్తే చాలు చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. మనం పట్టించుకోకపోవటం, వాళ్లకు బుద్ధి లేకపోవటం వల్ల దేశం తీవ్రంగా నష్టపోతోందన్నారు. అందుకే మీ అభివృద్ధి కోసం, మీకు మెరుగైన ఉపాధి, ఎదిగే అవకాశాల కోసం కొంత సమాజాన్ని పట్టించుకోండి అని విద్యార్థులకు సూచించారు. ఈ మేలుకొలుపు కోసమే కాకుండా, యువత, ఇతర ప్రజలు సంఘటితంగా చేసేందుకే యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్ వెబ్ ప్లాట్‌ఫారాలను కూడా అందిస్తున్నామని వీటిలో ఎన్‌రోల్ కావాలని తెలిపారు.

అధికారంలోకి వచ్చేందుకు రాజకీయాలు అవసరమేనని, అయితే సరైన పాలన అందించలేని అధికారం అనవసరమని జేపీ అన్నారు. దేశ జనాభాలో ఎక్కువ శాతం యువతని, భవిష్యత్తు వారిదేనని, విషయ పరిజ్ఞానాన్ని, పరిష్కారాల్ని గుర్తించకపోతే నష్టం కూడా వారికే ఎక్కువ జరుగుతుందని అన్నారు. నిరుద్యోగ భృతి వంటి రాజకీయ ఉచ్చులు పన్నకుండా సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త ఉద్యోగాల సృష్టికి ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన కృషి చేసేలా పోరాడాలన్నారు.

సుంకు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మంజునాథ్, వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు కె.రామసుబ్బారెడ్డి, భూపతినాయుడు, నరేంద్ర, జనసేన మండల యువనాయకుడు ఫాజిల్, బాస్ జిల్లా కార్యదర్శి సచిన్, సుకుమార్, లోక్‌సత్తా నేతలు రామ్మోహనరావు, బాబ్జీ, బాలసుబ్రహ్మణ్యం, శరవణ్‌కుమార్, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ✳

## రాజకీయం వ్యాపార నేతలది కాదు, యువతదే!
## పట్టణ యువసత్తా అధ్యక్షునిగా గురునాథం



రాజకీయమంటే దేశం ఎలా ఉండాలో కోరుకునే యువతదే తప్ప రాజకీయాన్ని వ్యాపారం చేసేవారిది కాదని లోక్‌సత్తా పార్టీ విజయనగరం నియోజకవర్గ అధ్యక్షుడు అల్లంశెట్టి నాగభూషణం అన్నారు. లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మంచి రాజకీయాలు కోరుకునేవారు లోక్‌సత్తా పార్టీని అనుసరించాల్సిన అవసరముందని, లేకుంటే ప్రధాన రాజకీయ పార్టీలు యువతను పనికిమాలిన పథకాల పేరుతో ఎందుకూ పనికిరాకుండా నిర్వీర్యం చేస్తాయని అన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మొల్లేటి చిన్నారావు మాట్లాడుతూ, త్వరలో పట్టణంలోని అన్ని వార్డుల్లో పర్యటించి యువతను చైతన్యవంతుల్ని చేస్తామన్నారు. పట్టణ యువసత్తా నూతన కమిటీని ప్రకటించారు.


యువసత్తా అధ్యక్షునిగా రొక్కం గురునాథం, కార్యదర్శిగా లెంక లక్ష్మణరావు, సహాయ కార్యదర్శులుగా పీఎల్ఎన్ రాజు, సి. ఆనంద్, ఉపాధ్యక్షులుగా తాత్రాజు పెంటబాబు, చప్పు మధు, కోశాధికారిగా బి.భాస్కర్, సభ్యులుగా సూర్య, కృష్ణ, నారాయణరావు, వినోద్, ప్రకాష్, రవిలను ప్రకటించారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు రాజారావు, అప్పారావు, రమేష్, శ్రీను, ఎర్నిబాబు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పరాకాష్ఠకు చేరిన విలువల పతనం

**- కొమ్మినేని శ్రీనివాసరావుతో ఏపీ ప్రభుత్వ మాజీ సీఎస్ అజేయ్ కల్లాం -**

**గత 35 ఏళ్ల ప్రభుత్వ పాలనతో పోలిస్తే నాలుగేళ్ల చంద్రబాబు పాలన చెత్తపాలనగా మిగిలిందని నూతన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి అజేయ్ కల్లాం అన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అంటే ప్రజల ప్రయోజనాలకు సంరక్షణ కర్తలుగా ఉండాలి అనే భావననే క్షీణింపజేస్తూ, వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తూ వచ్చారని ఆరోపించారు. పాలకులు చెడుమార్గం పట్టినప్పుడు పౌర సమాజమే తగు నిర్ణయం తీసుకోవాలంటున్న అజేయ్ కల్లాం అభిప్రాయాలు ఆయన మాటల్లోనే...**



**మీరు రాసిన 'మేలుకొలుపు' లక్ష్యం ఏమిటి?**

**కల్లాం:** వేకప్ కాల్ అనే ఇంగ్లీషు పదానికి తెలుగు అర్థం మేలుకొలుపు. 1980ల నాటి రాజకీయ నేతల్లో కాస్త నిజాయతీ ఉండేది. ఆ తరం నేతలు నిజాయతీపరులైన అధికారులను ఇబ్బంది పెట్టేవారు కాదు. సమాజం కోసం, రాష్ట్రం కోసం ఎవరైనా మంచి సలహా ఇస్తే 'అవును.. మనం అలా చేద్దాం' అని ప్రోత్సహించేవారు. ఆ విధంగానే మనకు ఐటీడీఏ వంటి గొప్ప సంస్థలు ఏర్పడ్డాయి. కానీ 1980ల చివరికి వచ్చేసరికి మా కళ్ల ముందే వ్యవస్థలన్నీ ధ్వంసం అయిపోవడం, క్షీణించిపోవడం చూశాం. వ్యవస్థలు విఫలమవటం, ఆనాటివరకు కొద్దిస్థాయిలో ఉండే అవినీతి తర్వాత భరించలేని స్థాయికి చేరడం, విలువలు పూర్తిగా పక్కకుపోవడం, సమర్థత ప్రాతిపదికన కాకుండా మనకు పనికొచ్చేవాడు ఎవరు అంటూ ఉన్న ఆఫీసర్లలో వెతుక్కోవడం మొదలైంది. మనప్రాంతం వాడా, మన కులంవాడా, మనం అడిగిన పని చేసిపెడతాడా లేదా అనేవి పదవులకు కొలమానాలుగా మారాయి. బ్యూరోక్రాట్లకు ప్రజాప్రయోజనాలతో ఏమాత్రం పనిలేదనే వాతావరణాన్ని తీసుకొచ్చారు. ఐఏఎస్, ఐపీఎస్ అంటే ప్రజల ప్రయోజనాలకు సంరక్షణ కర్తలుగా ఉండాలి తప్ప రాజకీయ ప్రయోజనాల కోసం కాదు. ఆ భావననే క్షీణింపజేస్తూ, వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తూ వచ్చారు. దీనిపైనే నా 'మేలుకొలుపు'.

**ప్రభువులు మీ పట్ల చాలా ఆగ్రహంతో ఉన్నట్లున్నారే?**

ప్రశ్నించే అలవాటు సమాజం నుంచి పోవడం వల్లే వాళ్లాస్థాయికి వచ్చారు. ప్రశ్నిస్తే ఆగ్రహించడమా?

**నాయీ బ్రాహ్మణులను సచివాలయంలోకి ఎందుకు రానిచ్చారు అని సీఎం అరిస్తే ఎలా?**

నాయకులు బ్యాలెన్స్ తప్పినప్పుడే ఇలాంటివి జరుగుతుంటాయి. ఎవరూ మమ్మల్ని ప్రశ్నించకూడదు, మేం మాత్రం అందరి మీదా పెత్తనం చెలాయిస్తాం అంటే మీరు అక్కడ ఉండే పరిస్థితే ఉండదు.

**ఇద్దరు సీనియర్ అధికారులు ప్రభుత్వ విధానాలను వరుసగా తూర్పారబట్టడం ఇదే ప్రథమం కదా?**

గతంలో మన వ్యవస్థలో ఎప్పటికప్పుడు కొద్దోగొప్పో సానుకూలంగా ఆలోచించేవాళ్లం. విచిత్రం ఏమిటంటే, పోయినవాళ్లే మంచివాళ్లు అని పెద్దలు చెబుతుంటారు కదా. గత 35 ఏళ్లుగా కొత్త ప్రభుత్వాలు వచ్చినప్పుడల్లా పరిస్థితులు మెరుగవుతాయనే ఆశ ఎక్కువగా ఉండేది. కానీ దానికి పూర్తి భిన్నంగా జరుగుతూ వస్తోంది. పాలనకు సంబంధించి ఏ అయిదేళ్ల కాలాన్ని తీసుకున్నా, అంతకుముందు అయిదేళ్ల పాలనే ఉత్తమంగా ఉండేదన్న ప్రతిస్పందన ఆటోమేటిక్‌గా వస్తోంది. పరిస్థితి మెరుగుపడటానికి బదులు దిగజారుతూండటాన్నే చూస్తున్నాం. అయితే పార్టీలే తమ ఎజెండాను తీసుకెళ్లి ప్రజలకు ఇవి చేస్తాం, అవి ఇస్తాం అంటూ చెబుతూ వస్తున్నాయి కానీ.. ప్రజలు మాకు ఇది కావాలి, ఇది వద్దు అని తమ సొంత ఎజెండాను రూపొందించుకుని డిమాండ్ చేసే పరిస్థితి ఏర్పడాలన్న ఆలోచన మా ఇద్దరికీ వచ్చింది.

ఒక్కటి మాత్రం నిజం. ఏపీలో ఇప్పుడున్న ప్రభుత్వ పాలన గత 35 ఏళ్లుగా పాలించిన ప్రభుత్వాలన్నింటి కంటే చెత్త పాలన అని మాత్రం చెప్పాలి. కారణం ఏమంటే ప్రభుత్వ పాలనా సంస్థలు పూర్తిగా బలహీనమైపోయాయి.

**కానీ మండల వ్యవస్థ ద్వారా పాలనను ప్రజల దగ్గరకు తీసుకెళ్లారని ప్రశంస కూడా వచ్చింది కదా?**

ఉన్న వ్యవస్థలను పనికిమాలినవిగా తయారు చేసి, ప్రజల వద్దకు పాలన అంటే ఉపయోగం ఏమిటి? పైగా మండల వ్యవస్థ నాటి నుంచి నేటి వరకు కూడా ఒక వ్యవస్థగా బలోపేతం కాలేదు. గతంలోని గ్రామీణ సమితులకు అది ప్రత్యామ్నాయం కాలేదు. మెంటే పద్మనాభం గారితో నాకున్న చనువుతో నేను ఆయన్ని ప్రశ్నించాను. ఇదేంటండీ తగిన ప్రత్యామ్నాయం ఏదీ తీసుకురాకుండానే మీరు ఉన్న వ్యవస్థలన్నింటినీ దునుమాడుతున్నారు (ఆరోజు నుంచి ఈరోజు వరకు గ్రామీణ రికార్డులు బాగుపడలేదు), వ్యవస్థలను నాశనం చేస్తే మీకేంటండీ లాభం? ప్రజలకు సరఫరా దెబ్బతింటుంది, దాంతో మీకు చెడ్డపేరు వస్తుంది కదా అని ఆయన్ని అడిగాను. దానికాయన అభిమానంతోనే ఒక విషయం చెప్పారు. అజేయ్ మీరంతా యువకులు. మీరు ఆదర్శవాదంతోనే ఆలోచిస్తుంటారు. వ్యవస్థలన్నీ చక్కగా పనిచేసిపెడితే ఇక మా దగ్గరకు ఎవడొస్తాడయ్యా.. వ్యవస్థలు పాడైపోతేనే మా పాత్ర, ప్రాధాన్యం ప్రజల్లో పెరుగుతుంది అని చెప్పారాయన. ఆ విధంగా అప్పటి నుంచి క్రమక్రమంగా ఒక్కో వ్యవస్థనూ నాశనం చేసుకుంటూ పోయారు. పైగా ఈరోజు ప్రభుత్వంలో ఏ కలెక్టర్‌కి, ఏ విభాగాధిపతికి స్వేచ్ఛ ఉంది? నాయకులు మొత్తం అధికారాలను తమ సొంతం చేసుకుంటున్నారు. కేంద్రీకరించుకుంటున్నారు.

**సింగపూర్ కంపెనీకి భూములు కట్టబెట్టడంపై (సీఎస్‌గా) మీరు అభ్యంతరం వ్యక్తం చేయలేదా?**

ఎందుకు లేదు? సింగపూర్ కంపెనీకి 1600 ఎకరాలు కట్టబెట్టడం అనేది ఏకపక్ష ఒప్పందం. దీంట్లో ప్రజాప్రయోజనాన్ని బలి తీసుకుంటున్నారు. ప్రభుత్వం అవతలివాళ్లకు లాభం కలిగించేలా చేస్తోంది అని చాలా క్లియర్‌గా మా వాదనపై ఆరు పాయింట్లు నిర్దిష్టంగా రాసి అందించాం. దాన్ని కేబినెట్ భేటీలో స్వయంగా నేను లేవనెత్తినా ఒక్క మంత్రి కూడా మాట్లాడలేదు. మహారాష్ట్రలో దబోల్ విద్యుత్ ప్రాజెక్టు కేసు మీకు గుర్తుందా? దానికీ దీనికీ పెద్ద తేడా లేదండీ అని చెప్పాను. అవునవును. మీరు చెప్పాల్సింది మీరు చెప్పారు. కానీ మా నిర్ణయం మేము తీసుకుంటాము అని స్పష్టం చేశారు. ఈ అంశంపై నా విధి నేను చేశాను. కాబట్టి పశ్చాత్తాపపడాల్సిన పని లేదు.

**మీరు కాదన్నా కేబినెట్ ఓకే చేసింది కదా?**

పౌర సమాజమే దీనికి సమాధానమివ్వాలి. ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణయం పౌర సమాజానిదే కదా.

**రాజధాని అమరావతి చుట్టూ పరిణామాలపై మీకేమనిపిస్తోంది?**

నిజం చెప్పాలంటే రాజధాని వ్యవహారాల్లో మేమెన్నడూ జోక్యం చేసుకోలేదు. దాంట్లో మా పాత్ర ఏమీ లేదు. కానీ ప్రపంచంలో ఏ అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశంలో కూడా రాజధానికి ఇంత ప్రాధాన్యమిచ్చిన చరిత్ర ఎక్కడా లేదు. ఇంత హైప్ చేసింది లేదు కూడా. మన దేశ ఆర్థిక వ్యవస్థ కంటే పెద్దదైన కాలిఫోర్నియా నగరంలో ప్రభుత్వ శాఖలు ఎక్కడో ఒక మూలన పడేసినట్లుంటాయి. నెదర్లాండ్స్‌లో ప్రభుత్వ శాఖలన్నీ హేగ్ వంటి చిన్న నగరంలో ఉంటున్నాయి తప్ప రాజధాని ఆమ్‌స్టర్‌డామ్‌లో లేవు. ఆస్ట్రేలియాలో కీలక శాఖలన్నీ కాన్ బెర్రా అనే 3 లక్షల జనాభా ఉన్న అటవీ ప్రాంత పట్టణంలో ఉంటున్నాయి. రాజధాని అంటే పరిపాలనా శాఖలతో కూడిన నిర్మాణం. దాన్ని ఒక పెద్ద మెగాసిటీగా, గ్రేటర్ సిటీగా పెంచాల్సిన అవసరం లేదు. అందులోనూ చేతిలో డబ్బులు లేని దాసరికి అవసరమే లేదు. రెండుమూడు ప్రభుత్వ భవనాలు, రెండువేల కోట్ల ఖర్చు, కావలసిన డ్రైనేజీ వ్యవస్థలు, రోడ్లు, మౌలిక వసతులు తప్పితే అంతకు మించిన పెట్టుబడి అవసరమే లేదు. అక్కడున్న అవకాశాలను బట్టే రాజధాని చుట్టూ సహజ సిద్ధంగా అభివృద్ధి చేసుకుంటూ ఉంటుంది. ఈమాత్రం దానికి రాజధానిని పూర్తిగా కేంద్రీకృతం చేయాల్సిన అవసరం లేదు. పాలన ఎంత వికేంద్రీకరణకు గురైతే అంత సమర్థంగా ఉంటుంది. నిజంగా సచివాలయం అనేది గ్రామంలో ఉండాలి. గ్రామ వ్యవహారాలను నిత్యం చూసే సెక్రటేరియట్ అది. నేటికీ చాలా దేశాల్లో సెక్రటేరియట్ అనే భావనే లేదు. దేశ రాజధాని ఢిల్లీలో సెక్రటేరియట్ ఉందా? వివిధ శాఖలు మాత్రం ఉన్నాయి. వాటి పని అవి చూసుకుంటున్నాయి.

**ఆన్‌లైన్ వ్యవస్థ వచ్చింతర్వాత అన్నీ ఒకేచోట కేంద్రీకరించడం ఎందుకు?**

అవును. ఆన్‌లైన్ వ్యవస్థతో పనులు సమర్థంగా జరుగుతాయి. అవినీతిని పూర్తిగా అరికట్టేందుకు వీలిచ్చే ఈ వైఖరిని మొత్తం ప్రపంచమంతా ప్రస్తుతం పాటిస్తోంది.

ప్రభుత్వాఫీసులన్నీ ఒకే చోట ఎందుకు పెట్టాలి? నాలుగు డిపార్ట్‌మెంట్లు తిరుపతిలో, మరో నాలుగు విశాఖలో పెట్టండి. కొన్ని విభాగాలను కర్నూలులో పెట్టండి. దాని వల్ల నష్టం ఏమిటి? ఏ డిపార్ట్‌మెంట్‌తో ఎవరికి పనిబడితే వారు మాత్రమే అక్కడికి వెళతారు. అంతేగానీ అన్ని పనులకూ రాజధానికే ఎందుకు రావాలి? రాజధానిలో ఉండటం వల్ల ఎవరికీ లాభం లేదు. కేవలం ప్రభుత్వోద్యోగులకు అక్కడికక్కడే ట్రాన్స్‌ఫర్ చేసుకోవడానికి తప్ప ఇతరులకు లాభం ఏమిటి? రెండోది ఎమ్మెల్యేలు పైరవీలు చేసుకోవడానికి కూడా రాజధాని ఉపయోగపడుతుంది. అంతేతప్ప సాధారణ ప్రజలకు అన్నీ ఒకే చోట ఉండటం వల్ల ఒరిగేదేమీ లేదు. ✳

# ప్రత్యామ్నాయ రాజకీయంతోనే మహిళల భద్రత, విముక్తి

ప్రత్యామ్నాయ రాజకీయంతోనే మహిళల భద్రత, ఆర్థిక విముక్తి సాధ్యమవుతాయని సీపీఐ, సీపీఎం, లోక్‌సత్తా నేతలు పేర్కొన్నారు. దేశంలో మహిళలపై అత్యాచారాలు ఎక్కువ య్యాయని, ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని గుర్తుచేశారు. అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో మహిళా సదస్సు నిర్వహించారు. సదస్సు ప్రారంభంలో మాజీ ఎంపీ చెన్నుపాటి విద్య మృతికి సంతాపం ప్రకటించారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లను ఎందుకు అమలు చేయటంలేదో చెప్పాలని నేతలు డిమాండ్ చేశారు. ఎవరో వస్తారని ఎదురుచూడకుండా అవకాశాల కోసం మహిళలు చొరవ తీసుకోవాలన్నారు. ప్రత్యామ్నాయ రాజకీయం దిశగా ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, లోక్‌సత్తా, ఆమ్‌ఆద్మీ పార్టీలు కృషి చేస్తున్నాయని, మద్దతివ్వాలని కోరారు. సదస్సులో



సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, మధు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి, ప్రొఫెసర్ సుజాత, లోక్‌సత్తా నేత వెంకట రమణబాబు, ప్రముఖ రచయిత శింగమనేని నారాయణ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాలెం చంద్రశేఖర రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, నేతలు జగదీష్, రాంభూపాల్, సావిత్రి, పద్మావతి, నారాయణ స్వామి, జాఫర్, లక్ష్మీదేవి, జనసేన ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

# గురజాడ ఇంటిపక్కన మద్యం దుకాణం అవసరమా?



తెలుగు జాతికి అభ్యుదయ అడుగుజాడగా నిలిచిన గురజాడ అప్పారావు ఇంటిపక్కన మద్యం దుకాణం ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రజలందరికీ అవమానకరమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సయిజ్ జిల్లా సూపరింటెండెంట్‌ని కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయాన్ని రాష్ట్ర కమిషనర్ లక్ష్మీనరసింహం దృష్టికి కూడా మొబైల్ మెస్సేజ్ ద్వారా తీసుకెళ్లారు. గురజాడ ఇంటి వద్ద, విద్యాలయాలు, ప్రార్థనా స్థలాల వద్ద మద్యం షాపుల్ని ఏర్పాటు చేస్తే పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ ఫిర్యాదును పరిశీలించి కచ్చితంగా చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ హామీ ఇచ్చారు. డిమ్స్ కంప్యూటర్స్ డైరెక్టర్ రాజు, మాతా టైప్ రైటింగ్స్ గౌరీశంకర్, కంప్యూటర్ విద్యాసంస్థల ప్రతినిధి భాగ్యలక్ష్మి, కోచింగ్ సెంటర్ల ప్రతినిధులు రమణ, భవానీ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాలు, నగరాల నుంచి వచ్చే యువనాయకత్వం మీదే ఇక దేశ భవిష్యత్

అధికారం, అక్రమార్జన పట్ల లాలస లేకుండా చెదరని లక్ష్యశుద్ధి, ఆదర్శ భావాలుగల భారత రాజకీయ దిగ్గజాల్లో తుదితరం నేత సోమ్‌నాథ్ ఛటర్జీ అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ నివాళులర్పించారు. ఆయన మృతి గొప్ప లోటన్నారు. భారతదేశ ఉన్నతి రాష్ట్రాలు, నగరాల నుంచి వచ్చే కొత్తతరం నేతల మీద, వారికి మనం సాధికారతను అందించటం మీదే ఆధారపడి ఉందన్నారు.

# ప్రజారోగ్య విధానాల వైఫల్యం – గిరిజనుల పాలిట శాపం



వర్షాకాలం వచ్చింది అంటేనే ఏజెన్సీ ప్రాంతాల్లో విషజ్వరాలు ప్రబలడం, వందల సంఖ్యలో ప్రజలు మృత్యువాత పడటం సాధారణ విషయంగా మారిపోయింది. గతేడాది తూర్పు గోదావరి జిల్లా చాపరాయిలో విషజ్వరాలు ప్రబలి, ఉత్తరాంధ్రలో వైద్యసేవలు అందక పలువురు గిరిజనులు మృతి చెందడంపై సర్వత్రా ఆందోళనలు వ్యక్తమైనా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే ఆగ్రహంతో స్పందించినా.. ఈ ఏడాది కూడా దుస్థితి ఏమీ మారలేదు.

చాపరాయి ఘటనపై స్పందిస్తూ అప్పట్లో ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మంత్రిగా పనిచేసిన డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్న మాటల్ని ఈ సందర్భంగా ప్రస్తావించాలి. “ఇటువంటి పరిస్థితులలో మాటలు చెప్పడం మినహా ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు కల్పించడం ఆచరణ సాధ్యం కాదు. గిరిజన ప్రాంతాల్లో విషజ్వరాలు, వ్యాధులు ప్రబలడం ఇప్పుడు కొత్తగా వచ్చిన సమస్య కాదు. గత డెబ్బై ఏళ్ల నుంచి ఉంది. గిరిజన ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు లేకపోవడమే ప్రధాన సమస్య. ఒక్కో గిరిజన ప్రాంతంలో మొత్తం 3600 నివాసాలుంటే వాటిలో 1026 నివాసాలకు మాత్రమే అనుసంధానం ఉంది. రెండు వేలకుపైగా నివాసాలకు సరైన వసతులు కాని, రోడ్డు అనుసంధానం కాని లేవు. వారందరికీ కనీస వసతులు కల్పించాలంటే చాలా కష్టం. వేతనం చెల్లిస్తామని చెప్పినా అక్కడ పనిచేసేందుకు వైద్యులు ఎవరూ ముందుకు రావడం లేదు. ఆయా గ్రామాలలో ఏం జరిగినా ప్రభుత్వానికి సమాచారం కూడా వెంటనే అందటం లేదు. మూఢ నమ్మకాలు ఎక్కువగా ఉండడంతో అందుబాటులో ఉన్న సేవలను సైతం వినియోగించుకోవడం లేదు. చాలా గిరిజన గ్రామాలలో రోగం వస్తే వైద్యం కోసం 10 నుంచి 20 కిలోమీటర్లు నడిచి వెళ్లవలసి వస్తున్నది” అని మంత్రి చెప్పుకొచ్చారు.

ప్రతిపక్షాలు, పౌరసమాజంలా సమస్య వర్ణనకే పరిమితమైతే ఇంక ప్రభుత్వాలెందుకు అన్న స్పృహ మాత్రం ఆ మంత్రిలో కన్పించలేదు.

ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడైతే.. తప్పంతా అధికారుల మీద నెట్టేసి దులిపేసుకునే ప్రయత్నం చేశారు. గిరిజనుల అనారోగ్య సమస్యలకు కారణం ఏదైనా కావొచ్చుని, ఎంత వేగంగా స్పందించాలనేదే ముఖ్యమని క్లాస్ తీసుకున్నారు. విధులను సక్రమంగా నిర్వహించాలే తప్ప, సమర్థించుకోవాలని చూస్తే ప్రజలకు న్యాయం చేయలేమని హితవు చెప్పారు. ఇంత ఆగ్రహంతో ఊగిపోయినా, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారి మీద ఎటువంటి చర్యా తీసుకునే ప్రయత్నం మాత్రం ముఖ్యమంత్రి చేయలేదు. ఈ ఏడాది కూడా ఇదే పరిస్థితి కొనసాగుతూ గిరిజనులు అల్లాడుతున్నా, ముఖ్యమంత్రి స్పందించి లోపాల్ని సరిచేయటం మీద దృష్టి సారించలేదు. ఇటీవల ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పాడేరులో పర్యటించారుగానీ.. ఆకర్షణీయ నినాదాలివ్వటం తప్ప గిరిజనుల ఆరోగ్య సమస్యల్ని, ‘పెసా’ చట్టాన్ని కాలరాస్తూ వారి హక్కులను దోచేయటాన్ని చంద్రబాబు కనీసం ప్రస్తావించలేదు.

ముఖ్యమంత్రి ఆదివాసీ దినోత్సవ పర్యటన సమయంలో, ఆ తర్వాత కూడా లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఈ వైఫల్యాలపై గట్టిగా ప్రశ్నించి ప్రజల ముందుకు తీసుకొచ్చారు. విషజ్వరాలు, డెంగీతో ఇప్పటికే విజయనగరం జిల్లాలోని గిరిజన, మైదాన ప్రాంతాల్లో 50 మంది వరకూ మరణించినా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. ‘ప్రజలారా మన్నించండి! మీ ప్రాణాల్ని కాపాడుకోలేకపోయాం’ అంటూ మీడియా కటింగ్‌లతో కలెక్టరేట్ గాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో సంరక్షిత మంచినీరుని, కనీన అవగాహనను పెంచే విద్యావసతుల్ని, ప్రాథమిక వైద్యసౌకర్యాల్ని అందించాలని, మైదాన ప్రాంతంలోని పెద్దాస్పత్రుల్లో

వైద్యసిబ్బంది నియామకాల్ని వెంటనే చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలోని గిరిజన జనాభా ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల్లో ఎక్కువగా ఉన్నారు. వార్తాపత్రికల కథనాల ప్రకారం 2016లో విషజ్వరాల కారణంగా ఈ మూడు జిల్లాల్లో సుమారు 900మంది మృతి చెందారు. అయినా ప్రభుత్వ పక్షాన అధికారికంగా ఎటువంటి గణాంకాలు లేవు. విషజ్వరాలు ఇంత తీవ్ర సమస్యగా నెలకొన్నా.. రెండేళ్లకుపైగా విశాఖపట్నం జిల్లా మలేరియా అధికారి పదవి ఖాళీగా వదిలేశారు. ఉన్న సిబ్బంది సహితం సవ్యంగా పనిచేయలేదు.

వారంలో ఏడు రోజులు పనిచేయవలసిన ఆసుపత్రులు రెండు, మూడు రోజులకన్నా పనిచేయవు. చాలామంది డాక్టర్లు, ఇతర వైద్యసిబ్బంది సమీపంలోని పట్టణాలలో నివాసం ఉంటూ అప్పుడప్పుడు వచ్చి వెళుతున్నారు. అంబులెన్సులు చాలావరకు పనిచేసే స్థితిలో లేవు. అంబులెన్సులుంటే డ్రైవర్లు ఉండరు, డ్రైవర్లు ఉంటే డీజిల్ అందుబాటులో ఉండదు.

ఆంత్రాక్స్ వంటి విషజ్వరాలు సహితం ఇక్కడ ప్రబలుతున్నాయి. ప్రభుత్వం వర్షాకాలంలో ప్రతి కుటుంబానికి రెండు దోమతెరలు సరఫరా చేయవలసి ఉంది. ఆ విధంగా చూస్తే శ్రీకాకుళం జిల్లాకు రెండు లక్షల దోమతెరలు అవసరం కాగలవు. కానీ 50 వేలలోపు మాత్రమే ఆర్డర్ ఇస్తున్నారు.

విషజ్వరాలు ప్రబలకుండా చేయాలంటే కేవలం వైద్యసేవలు సరిపోవు. ముందు జాగ్రత్తలు చాలా అవసరం. దోమల వ్యాప్తికి కారణంగా ఉండే నీరు నిల్వ ఉండే గుంతలను శుభ్రం చేయాలి. ప్రజలకు పౌష్టికాహార లోపం పెద్ద సమస్యగా ఉంది. అందుకే ఇది వరకు 2005 నుంచి 2009 వరకు వర్షాకాలంలో ఉచితంగా నిత్యావసర వస్తువులను ప్రభుత్వం గిరిజనులకు సరఫరా చేసింది. సమస్య తీవ్రత దృష్ట్యా ఇప్పుడు కూడా ప్రభుత్వం అటువంటి చర్యను చేపట్టాలి. మూఢనమ్మకాలను వదిలించేందుకు చైతన్య కార్యక్రమాల్ని నిర్వహించాలి, విద్యా సదుపాయాల్ని మెరుగుపరచాలి.

ముందుగా జ్వరాల వల్ల ఎవరు మృతి చెందినా నిజాయతీగా నమోదు చేయడం, విధి నిర్వహణలో ఉదాసీనత ప్రదర్శించిన వారిపై తగు చర్యలు తీసుకోవడం, సంచార వైద్యశాలలు పనిచేసేటట్టు చేయడం జరగాలి. సమస్య తీవ్రతను తక్కువ చేసి చూపెట్టడం, అధికారుల మీద ఆగ్రహం వ్యక్తం చేయటం ద్వారా తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం ప్రభుత్వం చేస్తున్నది. ఇది చాలా ప్రమాదకరమైన ధోరణి.

(ఇన్‌పుట్స్: జాగృతి) ✳

# తెలంగాణలో కీలక శాఖల్లో 30 శాతం దాటని గిరిజన ప్రత్యేక నిధుల వ్యయం

గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక చట్టం తీసుకువచ్చినప్పటికీ ప్రత్యేక అభివృద్ధి నిధులు ఆశించిన స్థాయిలో ఖర్చు కావడం లేదు. తెలంగాణలో 2017-18 ఏడాదికి ఖర్చు చేసిన నిధులను పరిగణలోకి తీసుకుంటే పలు కీలక శాఖలు తమకు కేటాయించిన దానిలో 30 శాతం నిధులనూ వినియోగించుకోలేదు. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న విభాగాల్లో స్వల్పంగా మినహాయిస్తే మిగతా శాఖల్లో పరిస్థితి ఘోరంగా ఉంది. పరిశ్రమల శాఖలో అత్యధికంగా 85 శాతం నిధులు ఖర్చు చేసినట్టు చూపించినా, అవన్నీ పారిశ్రామిక ప్రోత్సాహకాల కింద పేర్కొన్నవే. రాష్ట్రంలో 2017-18 ఏడాదికి ఎస్టీఎస్‌డీఎఫ్ నిధుల ఖర్చుపై నోడల్ ఏజన్సీ ఇటీవల జరిపిన సమావేశంలో గణాంకాలు వెల్లడయ్యాయి.

ఈ నిధులను 39 శాఖల కింద విభజిస్తే అందులో 18 శాఖల్లో వ్యయాలు 30 శాతం దాటలేదని గణాంకాల్లో తేలింది. దాదాపు పది శాఖల్లో ఖర్చు సున్నా. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రెండు పడక గదుల ఇళ్ల పథకం అమలుకు కేటాయించిన నిధుల ఖర్చు దారుణంగా ఉంది. ఈ శాఖకు రూ.415 కోట్లు కేటాయిస్తే.. కేవలం 115 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. విద్యుదీకరణ లేని గిరిజన ప్రాంతాల్లో కీలకమైన సంప్రదాయేతర ఇంధన వనరులకు సమగ్రంగా నిధులు వ్యయం చేయలేదు. ఈ శాఖ పరిధిలో కేవలం రూ.కోటిన్నర (27.07 శాతం) ఖర్చు చేశారు. గిరిజన ప్రాంతాల తాగునీటికి కీలకమైన గ్రామీణ నీటి సరఫరా శాఖ కింద రూ.520 కోట్లు కేటాయిస్తే.. రూ.153 కోట్లు మాత్రమే వ్యయమయ్యాయి. పశుసంవర్థక శాఖ కింద పలు పథకాలు అమలు జరుగుతున్నా ఖర్చు కనీసం 20 శాతం దాటలేదు. వయోజన విద్య కింద అత్యధికంగా నిధులు ఖర్చు చేశామని చూపించినా, ఆ మొత్తం రూ.4 కోట్లు దాటలేదు.

# జాతిరత్నాలను జారవిడుస్తూ నవభారత నిర్మాణం చేస్తారా?



- అరుణా హాకిన్స్

అమ్మాయి పుడితే ఏ కుటుంబంలో వారైనా సిరిసంపదలు కలిసి వస్తాయని ఆనందపడిన రోజులున్నాయి. ఒకరికి మించి ఆడపిల్లలు కలిగినప్పుడు చదువు, పెళ్లి ఖర్చులు భరించగలమా?.. అనే దిగులు పడ్డారు. చదువులు వచ్చాయి, ఉద్యోగాలు చేసుకుంటారు, ఫర్వాలేదు అని భరోసాతో అదీ స్వీకరించారు. ఇప్పుడు ఒకే అమ్మాయి వున్నా చాలు అనే నిశ్చింత, కంటికి రెప్పలా కాపాడు కుంటాం అనే స్థాయి లేకుండా పోయాయి. పసిబిడ్డలను హాస్పిటల్లో కళ్లు తెరవగానే మాయం చేసే దౌర్భాగ్యస్థితి నుంచి సవాళ్లు మొదలవుతున్నాయి. వ్యభిచార గృహాలకు అమ్మివేయడం, అత్యాచారాలకు గురిచేసి ప్రాణాలు తీయడం వంటి దారుణాలు జరుగుతుంటే ప్రజలు భయాందోళనలతో బిక్కుబిక్కు మంటున్నారు, నిస్సహాయతతో కుంగిపోతున్నారు. ప్రపంచం ఆధునికతను సంతరించుకుంటూ ఎన్నో అద్భుతాల్ని సృష్టిస్తుంటే ఆడపిల్లలు మాత్రం విలాసవస్తువుగానే ఉంటున్నారు. ఆధునిక సాంకేతికత ఆడపిల్లలకు కొత్త అవకాశాలనిస్తున్నా, వారి పట్ల నేరాల్ని కూడా కొత్త పుంతలు తొక్కిస్తున్నా వణికిస్తోంది. మగవాళ్లలో, సమాజంలో పరిణతి పెరుగుతోందనటంలో సందేహం లేదు. కానీ పెరుగుతున్న 'విలాస' సంస్కృతిని అడ్డుకోవటానికి, నిరోధించటానికి అది చాలటం లేదు. హేతుబద్ధంగా జనాభాను అరికట్టే చర్యలు లేవు సరికదా, మనిషినే వ్యాపార వస్తువుగా వాడుకుందాం అనే విషపు దురాశ పెరిగిపోతోంది.

హైదరాబాద్ సమీపంలో యాదగిరి గుట్ట అనే ఊరు ఒక పుణ్యక్షేత్రంగా మనకు పరిచయమే. దూరప్రాంతాలకు వెళ్లలేని వారు నగరం నుంచి నేరుగా అక్కడికెళ్లి మొక్కులు తీర్చుకుంటారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక.. ఆంధ్రప్రదేశ్‌లో తిరుమల తిరుపతికి ఎంతటి ప్రాశస్త్యం ఉందో, అంతటి వైభవాన్ని యాదగిరి గుట్టకు తీసుకొస్తామంటూ ముఖ్యమంత్రి "యాదాద్రి"గా పేరు మార్చి విస్తరణ ప్రారంభించారు. ఆధ్యాత్మిక చింతన, మొక్కులతో కష్టాలు తీరి సకల సంపదలు, పదవులు దక్కుతాయని నమ్మే వారికి ముఖ్యమంత్రి మాటలు ఆనందం కలిగించొచ్చు. అలా చేయడం ద్వారా రాష్ట్ర సారథి తమ మనోభావాలను గౌరవించారని వారు అను కుంటుండొచ్చు! ప్రార్థనా స్థలాల గురించి, మతాల గురించి కార్యక్రమాలు చేయటం ముఖ్యమంత్రి బాధ్యతా? కాదా? అనే చర్చను అలా ఉంచితే.. యాదాద్రి చుట్టుపక్కల ప్రాంతాల్లో కొన్ని గ్రామాల్లోని కుటుంబాలు వ్యభిచారమే వృత్తిగా జీవిస్తున్నాయని, ఇందుకోసం పలుచోట్ల నుంచి అభంశుభం ఎరుగని చిన్నారు లను మాయచేసి తరలించారని తెలిసి నప్పుడు దిగ్భ్రాంతి కలిగింది. అక్కడ నరకకూపాల్లాంటి గదుల్లో దుర్భర జీవితాన్ని గడుపుతూ వయసుకి మించిన శారీరక ఎదుగుదల కోసం ఇంజక్షన్ల బారిన పడి వ్యభిచారంలో మగ్గుతున్న చిన్నారుల్ని గురించి వింటే మనసు వికలమైపోయింది. 'వీళ్లా జాతికి వారసులు, నవభారత రథసారథులు.. ఎవరు వీళ్లు ఎవరు వీళ్లు.. మనం జారవిడుచుకున్న జాతి రత్నాలు' అని ఎప్పుడో డాక్టర్ సి.నారాయణరెడ్డిగారు రాసిన పాట గుర్తొచ్చి బరువెక్కింది. అదిగో 'న్యూ ఇండియా' వచ్చేస్తోంది.. అని మోదీ ప్రభుత్వం ఊదరగొడుతున్నా ఆ పాత పాట ఇంకా పాత పడటం లేదు.

యాభై సంవత్సరాల క్రితం యాదగిరి గుట్ట ఊరికి ఒక ప్రాంతంలో ఈ వ్యభిచార గృహాలు ఉండేవని, వాటిని సామాన్య విషయంగా భావించేవారని విన్నాం.

క్రమంగా వారిలో మార్పు వచ్చి చదువుకోవడం, పెళ్లిళ్లు చేసుకుని గౌరవప్రదంగా బతకటం మొదలైనట్టు కూడా కథనాలు చదివాం. గత జీవితం నుంచి ఇక వారు విముక్తులయ్యారని, నరకప్రాయ జీవితం ఇక గతంలో సమాధి అయిపోయిందని భావించాం. కానీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వినిమయ సంస్కృతి పాత నరకాన్నే మరింత భయంకరంగా తయారు చేస్తున్నాయని తెలిసి షాక్ తిన్నాం.

యాదగిరి గుట్టలో 110 కుటుంబాలు కేవలం వ్యభిచార వృత్తిలోనే జీవిస్తున్నాయని హైదరాబాద్‌లో దశాబ్దాలుగా ఉన్నవారికి కూడా పెద్దగా తెలియకపోవచ్చు. కానీ అక్కడి అధికారులకు, ప్రజాప్రతినిధులకు, ముఖ్యమంత్రికి మాత్రం స్పష్టంగా తెలుసు. యాత్రాస్థలంలో వ్యభిచారం ఉంటే తప్పు లేదని అనుకుని ఇప్పటిదాకా పట్టించుకోలేదా? అనే ప్రశ్నకు వారు సమాధానం చెప్పి తీరాలి.

యాదాద్రిని సందర్శించే భక్తులంతా సన్యాసులు కారు. వీరిలో ఆనవాయితీగా, అలవాటుగా వ్యభిచార గృహాలను సందర్శించేవారు పెద్దసంఖ్యలోనే ఉండే అవకాశాలున్నాయి. పుణ్యక్షేత్రాన్ని కన్నులపండువుగా వ్యాపారాలకు అనువుగా తీర్చిదిద్దడం సులువే కావచ్చు. కానీ ఆ కుటుంబాలను సంస్కరించటం అనే బాధ్యతను తీసుకోకుండా యాదాద్రి అభివృద్ధి అంటే.. ప్రభుత్వమే అసాంఘిక కలాపాలకు పాల్పడుతూ అనైతిక వ్యాపారం చేస్తున్నట్టవుతుంది. ముఖ్యమంత్రేమీ మహానుభావుడిలా, దైవదూతలా వారిని ఆదుకోవాల్సిన పన్లేదు. కానీ చట్టబద్ధపాలన అందిస్తానని రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన నాయకుడిగా.. అమానుషంగా చిన్నపిల్లలతో వ్యభిచారం నిర్వహిస్తున్న వారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాల్సి ఉంది. ముమ్ముందు అలాంటి విషసంస్కృతికి ఆస్కారం లేకుండా పోలీసు వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సుంది.

ఇదే సమయంలో, ఇదే తరహాలో మరో ఘోరం బీహార్‌లో బైటపడింది.

బీహార్ రాష్ట్ర ప్రభుత్వం 110 స్వల్పకాలిక నివాస వసతి గృహాలను నడుపుతోంది. వీటిలో బాలికలు, వృద్ధుల ఆశ్రమాలూ ఉన్నాయి. అనాథలకు ఆశ్రమాలు, బిచ్చగాళ్ల సంరక్షణా కేంద్రాలు, పునరావాస-వితంతు-అభాగ్య మహిళల సంరక్షణ గృహాలు వంటివి కూడా ఉన్నాయి. వీటి నిర్వహణ బాధ్యత ప్రభుత్వానిదే అయినా కొన్ని ప్రభుత్వేతర సంస్థలూ ఇందులో భాగం పంచుకుంటున్నాయి. ఈ గృహాల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుసు కోవాలని కేంద్రం ముంబయిలోని 'టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్'ను 2017లో సంప్రదించి మహమ్మద్ తారిఖ్ నేతృత్వంలో 7గురు సభ్యులతో ఒక బృందాన్ని పంపింది. బీహార్ ముఖ్యమంత్రి కూడా ఈ ప్రయత్నాన్ని ప్రోత్సహించారు. ఈ బృందం 7 నెలలపాటు ప్రత్యక్షంగా పరిశీలించి నప్పుడు వీటిలో అనేకచోట్ల అందులో ఉంటున్నవారిపై లైంగిక, భౌతిక హింస, దౌర్జన్యాలు జరుగుతున్నట్టు గుర్తించింది. బ్రిజేష్ ఠాకూర్ అనే వ్యక్తి నడుపుతున్న హోమ్‌లో బాలికలపై నెలల తరబడి అత్యాచారాలు జరుగుతున్నాయని బయటపెట్టింది.

ఈ బృందంలో ముగ్గురు మహిళలు ఉన్నందు వల్ల కీలకమైన ఈ వివరాల్ని పసిగట్టటం, తెలుసుకోవటం సాధ్యమైంది.

బాలికల్లో శారీరకంగానూ, ప్రవర్తనలోనూ తేడాను నిశితంగా పరిశీలించి వారిని ఆప్యాయంగా ఆత్మీయంగా దగ్గరికి తీసుకుని బుజ్జగించి అడిగినప్పుడు.. కఠోరమైన వాస్తవాలు తెలిసివచ్చాయి. వాళ్లెంతగా భయపడుతున్నారంటే, జరిగిన దాడులు వేరొకరిపై జరిగినట్టు చెప్పారు తప్ప.. తాము దోపిడీకి గురైనట్టు చెప్పటానికి ధైర్యం చేయలేకపోయారు. ఇలా ఒక్క చోట కాదు.. అనేక ప్రాంతాల్లో అకృత్యాలు జరుగుతున్నట్టు తెలుసుకున్నారు.

ఇదంతా సులువుగా జరగలేదు. వాటి నిర్వాహకులు అడ్డుపడటం, తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయటం, బెదిరించటం చేశారు. ఈ బృందంలో ఒక మహిళ నాకు తెలిసిన వారి బంధువు. ఒక ఫ్రెండ్ ద్వారా నాకు విషయం తెలిసింది (పేరు చెప్పడం మర్యాద కాదు కనక ఇక్కడ వెల్లడించటం లేదు).

ఈ ఏడాది మే నెలలో బృందం తన నివేదికను ప్రభుత్వానికి ఇచ్చింది. చర్యలు తీసుకోవడంలో ఆలస్యం జరిగి విచారణ ఇప్పుడు కొనసాగుతోంది. బీహార్ రాష్ట్ర వసతి గృహాల గుట్టు వెనకాల సాక్షాత్తూ మంత్రులు, అధికారులు, కొందరు రాజకీయుల ప్రమేయం ఉన్నప్పుడు ఇలా గుట్టుగా వ్యవహారాలు సాగుతుంటాయి, విచారణలు వాయిదా పడుతూ, సాగుతూనే ఉంటాయి.

బీహార్ తర్వాత ఆంధ్రప్రదేశ్ ఒంగోలులో అనాథ బాలికలను లైంగిక వేధింపులకు గురిచేస్తున్న ఓ మతబోధకుడి ఉదంతం బయటపడింది. ఇండియా

ఎవాంజిలికల్ రిలీఫ్ ఫెలోషిప్ (ఐఈఆర్ఎఫ్) పేరుతో కొడవటికంటి జోసెఫ్ సేవ పేరుతో విదేశీ నిధులు సేకరించి ఓ సంస్థను నడుపుతున్నారు. ఓ పాఠశాలను, అనుబంధంగా వసతిగృహాన్ని నిర్వహిస్తున్నారు. వసతిగృహంలో ఉన్న విద్యార్థినులను నిత్యం వేధిస్తుండేవాడు. ఏడు పదుల వయసు పైబడినా తనను తాతయ్య అని కాకుండా మావయ్య అని పిలవాలంటూ చిన్నారులను బెదిరించేవాడు. దీనిపై ఫిర్యాదులను ఎట్టకేలకు జిల్లా బాలల సంరక్షణ కమిటీ (సీడబ్ల్యూసీ) పట్టించుకుంది. యాజమాన్యాన్ని బైటికి పంపి కమిటీ సభ్యులు బాలికలను విచారించారు. తమపై జరుగుతున్న దాష్టీకాన్ని కన్నీటిపర్యంతమై బాలికలు వివరించారు. దీంతో, నిందితుడిని అదుపులోకి తీసుకోవటంతోపాటు బాలికలను బాలసదన్‌కు తరలించారు.

బీహార్‌లో బాలికలపై దారుణాలకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిణి మంజూవర్మ భర్త కర్త అనే స్పష్టమైన ఆధారాలను మహమ్మద్ తారిఖ్ బృందం వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి అసాంఘిక చర్యలను, ఏపీలో ఒంగోలు దారుణాల్ని వార్తాపత్రికలు, టీవీ ఛానళ్లు ప్రముఖంగా బైటపెట్టి ప్రచారం చేశాయి.

అమాయక బాలికలపై జరిగే దాడులు సర్వత్రా ఉన్నాయి. పిల్లలను అపహరించి కాస్త జ్ఞానం తెలిశాక ఇంటి పనులకు, వ్యభిచారానికి బలి చేస్తూ వ్యాపార పెట్టుబడిగా వినియోగిస్తూ నరకం చూపించడం వింటూంటే.. దారుణం, రాక్షసత్వం, దరిద్రపు గొట్టు చర్య, ఘోర తప్పిదం.. ఇలా ఎన్ని మాటలు పుట్టుకు వస్తాయో!

ఈ దేశంలో పుట్టిన పాపానికి ఆడపిల్లలు (మగపిల్లలు కూడా కొన్ని సందర్భాల్లో) వ్యాపార వస్తువుగా మారుతున్నారని (మార్చబడుతున్నారని) తెలిసినప్పుడు ఏ కాస్త మానవత్వం ఉన్నవారికైనా వర్ణనాతీత బాధ కలుగుతుంది. ఈ మధ్య 'అమెరికా మానవ అక్రమ రవాణా నివేదిక' భారత్‌కు సంబంధించి బయటపెట్టిన అనేక విషయాలు తలదించుకునేలా ఉన్నాయి. భారతీయునిగా పుట్టినందుకు గర్వించు– పుణ్యభూమి నాదేశం– వెలిగిపోతోంది ప్రతిభ– ఇలా మనకి మనం చెప్పుకుంటూ జబ్బలు చరుచుకుంటే సరిపోతుందా?

ఆడపిల్ల పుడితే ఉచిత విద్య, ఉచిత వివాహం (తాళిబొట్టు సహా), మహిళలకు ఉద్యోగాల్లో, రాజకీయాల్లో పెద్దపీట (ఆ పీట మనకు స్వాతంత్ర్యం వచ్చాక తయారుచేయడం మొదలుపెట్టారు. ఇప్పటికి ఇంకా సగం కూడా పూర్తి కాలేదు. అది ఎప్పటికీ పూర్తిచేయలేనంత పెద్దపీటలా ఉంది!) కళ, క్రీడా రంగాల్లో ఎక్కడ చూసినా, ఏ రంగంలో అయినా మహిళలకు సగభాగం అన్నారు. అర్హత అనేది డబ్బుతోనే కొనుక్కోవలసి వస్తోంది తప్ప, పనితీరు, అనుభవం అక్కరకు రావడం లేదు. మహిళలకు జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించామని చెబుతున్న స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులు లేవు. సర్పంచ్‌లుగా పురుషులే పెత్తనం చేస్తున్నా, పైనున్న పాలకులు ప్రోత్సహిస్తున్నారు తప్ప నిరోధించటం లేదు. సంక్షేమ పథకాలు, సదుపాయాలు ఏ మేరకు అమలవుతున్నాయో పట్టించుకునే, సరిదిద్దే వ్యవస్థ లేదు. సమస్యలపై లోతైన అధ్యయనం చేసి పరిష్కారాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నాలు కరువవుతున్నాయి.

వైవిధ్యం తప్ప వివక్ష లేని మనుషులుగా ఆడపిల్లలు ఎదిగేలా చేయాలంటే.. ప్రభుత్వం తన బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించేలా పౌరులుగా మనం చేయగలగాలి. చట్టబద్ధపాలన, అందరికీ నాణ్యమైన విద్య–ఉపాధి, ఆరోగ్యం, మౌలిక వసతులు వంటివి ప్రభుత్వం చేయాల్సిన మొట్టమొదటి పనులు. ఈ పనుల్ని సక్రమంగా చేస్తే.. వ్యభిచార గృహాల్లో మగ్గాల్సిన పరిస్థితుల నుంచి, లైంగిక దోపిడీ నుంచి అమాయక బాలికలు, యువతులు, మహిళలు విముక్తమవుతారు. మన పొరుగున్న ఉన్న ఇళ్లల్లో, చుట్టూ ఉన్న సమాజంలో చెడును తేలిగ్గా నిరోధించే పౌర చైతన్యానికి బలమైన స్థానిక ప్రభుత్వాలు ఎంతో ఉపయోగపడతాయి. మా రోజువారీ జీవితాలను బాగు చేసుకునేందుకు మా ఊరికి, మా వార్డుకి అధికారాలు, నిధులు ఇవ్వండని ప్రభుత్వాన్ని ప్రజలు ప్రశ్నించి వాటిని గుంజుకోవాలి. ప్రభుత్వాధికారుల చేత సక్రమంగా పనిచేయించాలి. పాలనలో మార్పు, పౌరుల్లో చైతన్యం రెండూ ఏకకాలంలో కొనసాగుతుంటేనే.. వివక్ష లేకుండా భద్రతతో ఎదిగే అవకాశాలు ఆడపిల్లలు సహా సమాజంలో అందరికీ లభిస్తాయి. ఇందుకోసం మన చదువుల్ని, కెరీర్‌లను చూసుకుంటూనే కొంత సమాజాన్నీ పట్టించుకుందాం. సమస్యల్ని అవగాహన చేసుకుని సరైన పరిష్కారాలను సంఘటితంగా సాధించుకుందాం. షల్ వుయ్ గో...! *

# స్థానిక ప్రభుత్వాలను బలహీనపరచటం వల్లే బలమైన నాయకులు కరువవుతున్నారు: జేపీ




బలమైన స్థానిక ప్రభుత్వాలుంటేనే స్వపరిపాలన, సుపరిపాలన సాధ్యమవుతాయని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. కానీ మనదేశంలో స్వతంత్రం వచ్చిన నాటి నుంచి కూడా స్థానిక ప్రభుత్వాలను పట్టించుకోలేదన్నారు. స్థానిక పాలన సరిగా లేకుండా.. కేవలం ఓటుహక్కు మాత్రమే ఉంటే అది ప్రజాస్వామ్యం అనిపించుకోదన్నారు. ప్రజాస్వామ్య దేశమని చెప్పుకునే భారత్‌లో కంటే ఎక్కువగా కమ్యూనిస్టు నియంతృత్వ వ్యవస్థ ఉన్న చైనాలో స్థానిక ప్రభుత్వాలు బలంగా ఉన్నాయన్నారు. వేగవంతమైన చైనా అభివృద్ధికి పటిష్ట స్థానిక ప్రభుత్వాలు ఎంతగానో దోహదం చేశాయన్నారు. తెలుగు రాష్ట్రాలు స్థానిక ప్రభుత్వాలకు సకాలంలో ఎన్నికలు జరపకపోవటాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలనను తీసివేసి తక్షణం పంచాయతీ ఎన్నికల్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు.

'ప్రత్యేకాధికారుల పాలన రద్దుచేయాలి-పంచాయతీ ఎన్నికలు తక్షణమే నిర్వహించాలి' అంశంపై హైదరాబాద్ లక్డీకాపూల్‌లో లోకల్ గవర్నమెంట్స్ చాంబర్ నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి జేపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

తెలంగాణ ప్రభుత్వం రిజర్వేషన్ల కోసం ఎన్నికల్ని వాయిదా వేయటం సరైన చర్య కాదని జేపీ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం తలచుకుంటే ఐదు నిమిషాల్లో ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వగలదని, వారిపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నట్టు కనిపిస్తోందని అన్నారు. ఏపీలో జన్మభూమి కమిటీల ద్వారా పాలన తీవ్ర అభ్యంతరకరమన్నారు. ''కొత్తవాళ్లు, యువతీయువకులు రాజకీయాల్లోకి ప్రవేశించేందుకు, వారి నుంచి గొప్ప నాయకత్వం ఎదిగేందుకు మన ఎన్నికల వ్యవస్థలో అవకాశం లభించటంలేదని, స్థానిక ప్రభుత్వాల్ని నిర్వీర్యం చేయటంతో అక్కడ్నుంచీ నాయకత్వం రావటం లేదని.. ఈ రెండు వైఫల్యాలూ ఏకకాలంలో కొనసాగుతుండటం వల్ల ఈవేళ దేశ రాజకీయ, పాలన, సామాజిక రంగాలు పనికిమాలినవిగా తయారవుతున్నాయని'' అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ అలహాబాద్ మేయర్‌గా పనిచేయగా, సర్దార్ వల్లభాయ్ పటేల్ అహ్మదాబాద్ మునిసిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేశారన్నారు. బాబూ రాజేంద్రప్రసాద్ పాట్నా మేయర్‌గా పనిచేశారన్నారు. చిత్తరంజన్‌దాస్, సుభాష్ చంద్రబోస్, టంగుటూరి ప్రకాశం పంతులు తదితర దిగ్గజాలు స్థానిక ప్రభుత్వాల నుంచే రాజకీయాల్లోకి వచ్చారన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎన్నికల వ్యవస్థలో మార్పుకి సమయం పట్టవచ్చుని, కానీ స్థానిక ప్రభుత్వాల నుంచే ఎదిగే అవకాశాలు మాత్రం యువత చేతుల్లో ఉన్నాయన్నారు. రాజ్యాంగంలో స్థానిక ప్రభుత్వాలకు తగిన ప్రాధాన్యత కల్పించకుండా పొరపాటు చేసినా.. స్వతంత్రం వచ్చిన తొలినాళ్లలో కూడా స్థానిక ప్రభుత్వాల్లో సత్తా గల నాయకులు కనిపించారని గుర్తుచేశారు. చిన్న పట్టణాలు, నగరాల నుంచే పెద్ద మార్పుల్ని మొదలుపెట్టి దేశవ్యాప్తం చేయటం ఇప్పుడు సరైన ప్రణాళిక అన్నారు. రాజకీయ దిగజారుడుతనం గురించి యువత నిరాశపడకుండా.. స్థానిక ప్రభుత్వాల ఎన్నికల్లో పోటీ చేయాలన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని గ్రామ పంచాయతీ ఎన్నికలను ఇందుకు సదవకాశంగా వినియోగించుకోవాలన్నారు. దీన్ని సర్పంచ్‌ల పోరాటంగా కాకుండా దేశ స్వాతంత్ర్య పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటంగా చూడాలన్నారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ, బీసీల రిజర్వేషన్ అమలు కోసం పంచాయతీ ఎన్నికలను వాయిదా వేస్తున్నట్టు చెప్పిన ప్రభుత్వం జనాభా లెక్కలు, సకల జనుల సర్వే వివరాల్ని ఎందుకు బహిర్గతం చేయటం లేదని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య రాజ్యంలో ప్రజలే పాలించాలిగానీ అధికారుల పాలన జరగకూడదన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని పాలకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ పంచాయతీ ఎన్నికలు జరగకుండా అడ్డుపడుతున్నారన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో గ్రామీణ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని సమాచార శాఖ మాజీ కమిషనర్ విజయబాబు అన్నారు. గౌరవ అతిథిగా పాల్గన్న విశాలాంధ్ర మహాసభ అధ్యక్షుడు నల్లమోతు చక్రవర్తి మాట్లాడుతూ, ప్రభుత్వాలు ప్రజల్ని మోసం చేయటం మానుకోవాలన్నారు. ప్రభుత్వ వ్యవస్థలలో స్థానిక ప్రభుత్వాలు విలువైనవని, జెండాల పేరుతో గ్రామాల్లో ఐక్యతను దెబ్బతీస్తున్నారని సర్పంచ్‌ల ఐక్యవేదిక అధ్యక్షుడు అందోల్ కృష్ణ అన్నారు. సమావేశంలో లోకల్ గవర్నమెంట్స్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడు ఉప్పల అంజనీ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి నందెల్లి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ గాదె రోశిరెడ్డి, జి.వీరభద్రాచారి, పలు సంఘాలు, పార్టీల నాయకులు పాల్గొన్నారు. ✳

# ఎన్నికల నేపథ్యంలో లోక్‌సత్తా పార్టీ బలోపేతానికి ఏపీ, తెలంగాణల్లో కమిటీల్ని ప్రకటించిన జేపీ




ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో లోక్‌సత్తా పార్టీని బలోపేతం చేసేందుకు రెండు రాష్ట్రాల్లో రెండు అడహాక్ కమిటీల్ని నియమిస్తున్నట్టు లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రకటించారు. ఈ కమిటీలు తమ తమ రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటించి లోక్‌సత్తా పార్టీ, ఉద్యమ నేతలు, కార్యకర్తల నుంచి శ్రేయోభిలాషుల దాకా అందరితో సమావేశాల్ని నిర్వహించి సెప్టెంబర్ 30వ తేదీలోగా సమగ్ర నివేదికను సమర్పిస్తాయని తెలిపారు.

**రానున్న ఎన్నికల నేపథ్యంలో లోక్‌సత్తా పార్టీ బలోపేతానికి కమిటీల ఏర్పాటు, ఇతర వివరాలతో మీడియాకు విడుదల చేసిన జేపీ ప్రకటన పూర్తి పాఠం..**

"లోక్‌సత్తా కొన్ని నిర్దిష్టమైన రాజకీయ సంస్కరణలు, పాలనా సంస్కరణలు, ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయటం, అవినీతిని అంతం చేయటం లక్ష్యాలుగా ఏర్పడిన ఉద్యమ పార్టీ. ఒక ఉద్యమానికి, ఉద్యమ పార్టీకి పోటీతో సంబంధం లేకుండా ప్రజలలో ఆలోచనలు పెంచటానికి, ఎజెండాను విస్తృతంగా ప్రచారం చేయటానికి, లక్ష్యాల సాధన కోసమూ కార్యక్రమాలని, ఉద్యమాలని చేపట్టటానికి ఎన్నికల సమయం కీలకమైన అవకాశం.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో లోక్‌సత్తా పార్టీని బలోపేతం చేయటం, వేలాదిమంది కొత్త కార్యకర్తలను ఉత్సాహపరచటం, నిర్మాణాత్మక కార్యక్రమాల్ని చేపట్టటం అవసరం. ఇందుకు కావలసిన ఏర్పాట్లను చేయటానికి, బలమైన ఉద్యమ పార్టీగా లోక్‌సత్తా పార్టీ నిర్మాణానికి సన్నాహాలు చేయటానికి ఉభయ రాష్ట్రాల్లోనూ ఈ కింది నాయకులతో అడహాక్ కమిటీల్ని ఏర్పాటు చేయటం జరుగుతున్నది.

**ఆంధ్రప్రదేశ్ కమిటీ సభ్యులు (పేర్ల ఆంగ్ల అక్షర క్రమంలో):**

1. శ్రీ భీశెట్టి బాబ్జీ
2. శ్రీ కల్లూరి బాలసుబ్రహ్మణ్యం
3. శ్రీ జె. ఐరామ్మూర్తి
4. శ్రీ జి. జానకిరామరాజు
5. శ్రీ ముదునూరి రాజ్ వర్మ
6. శ్రీ వై.డి రామారావు
7. శ్రీ అల్లు రమేష్ రెడ్డి
8. డాక్టర్ జె. శ్రీనాథ్
9. శ్రీ నర్రా శ్రీధర్
10. శ్రీ చెన్నుపాటి వజీర్
11. శ్రీ జె. వెంకటేశ్వర్లు

**తెలంగాణ కమిటీ సభ్యులు (పేర్ల ఆంగ్ల అక్షర క్రమంలో):**

1. శ్రీమతి ఎస్.వి గజానని
2. శ్రీ సాతులూరి గోవిందరావు
3. శ్రీ పర్చా కోదండ రామారావు
4. శ్రీ ఎల్.వి రామరాజు
5. శ్రీ దోసపాటి రాము
6. శ్రీ పి. రవిమారుత్
7. శ్రీ నందిపాటి రవీందర్
8. శ్రీ తుమ్మనపల్లి శ్రీనివాస్

ఈ బృందాలు తమ తమ రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటించి ఉద్యమ లక్ష్యాల కోసం, పార్టీని బలోపేతం చేయటం కోసం సూచనలు చేయటంతోపాటు చర్యల్ని కూడా చేపడతాయి. వారి నివేదికలు ఆధారంగా పార్టీని బలోపేతం చేయటం కోసం, పటిష్ట నిర్మాణం కోసం తగిన నిర్ణయాల్ని తీసుకోవటం జరుగుతుంది. ఈ బృందాలు విస్తృతమైన లోక్‌సత్తా పార్టీ నాయకులు, సభ్యులతోనూ, లోక్‌సత్తా ఉద్యమ నాయకులు, కార్యకర్తలతోనూ, లోక్‌సత్తా అభిమానులు, మద్దతుదారులు, ఇతర శ్రేయోభిలాషులతోనూ అన్ని చోట్లా చర్చలు జరుపుతారు. సెప్టెంబర్ 30వ తేదీలోగా సమగ్ర నివేదికల్ని సమర్పించవలసిందిగా ఈ బృందాన్ని కోరటం జరుగుతున్నది. అవసరాన్ని బట్టి అదనంగా ఈ బృందాల్లో సభ్యులని నియమించటం జరుగుతుంది".

**డా॥ జయప్రకాష్ నారాయణ్,**
లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు

✳



లోక్‌సత్తా పార్టీ జీహెచ్‌ఎంసీ విభాగం
నాయకులతో హైదరాబాద్ కార్యాలయంలో
సమావేశమైన డా॥జేపీ





దేశ 72వ స్వాతంత్ర్య దినోత్సవం
సందర్భంగా లోక్‌సత్తా ఆధ్వర్యంలో
హైదరాబాద్‌లో, విజయనగరంలో
నిర్వహించిన జాతీయజెండా పండుగ
కార్యక్రమాలు



Posting Date 07-09-2018
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on September 1st, 2018




ప్రతి ఒక్కరి,
ప్రతి ఇంటి పుస్తకం!
తప్పక చదవండి,
చదివించండి!!

పేజీలు : 64

వెల : రూ. 20/-

| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad